నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
మెదక్
బుధవారం | 21 ఫిబ్రవరి 2024 | www.navatelangana.com

ఐఐఐటి విద్యార్థినికి వీవీఆర్ ఫౌండేషన్ ఆర్థిక చేయూత

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



బొల్లారం మున్సిపాల్టీ పరిధిలోని మోడల్ కాలనీలో నివసించే వీరేశం కూతురు సౌమ్యశ్రీ ఐఐఐటి కోర్సు చదవడం కోసం స్థానిక వీవీఆర్ ఫౌండేషన్ చేయూతనందించింది. సౌమ్యశ్రీని ప్రోత్సహిస్తూ మున్సిపల్ యువత నాయకులు వి.ప్రవీణ్ రెడ్డి మంగళవారం ఆ విద్యార్థిని తండ్రి వీరేశంకు రూ.6వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌రెడ్డి మాటాడుతూ.. ఉన్నత చదువులకు పేదరికం అడ్డుకాకూడదన్నారు. ఐఐఐటీలో బాగా చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి.. మున్సిపాల్టీకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మోహన్ రెడ్డి, వెంకటేష్, మాధవ్ పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకులో రూ.27 కోట్ల కుంభకోణం

నవతెలంగాణ-రామచంద్రాపురం

తప్పుడు ధృవీకరణ పత్రాలు సమర్పించి అప్పటి ఆంధ్రాబ్యాంక్ ప్రస్తుత యూనియన్ బ్యాంకుకు రూ.27 కోట్ల కుచ్చుటోపీ పెట్టిన 12 మందిని రామచంద్రాపురం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు వారిని మంగళవారం సంగారెడ్డి జిల్లా కోర్టులో హాజరుపరిచారు. ఇన్‌స్పెక్టర్ నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రామచంద్రాపురంలోని 2016లో అప్పటి ఆంధ్రాబ్యాంక్‌లో పని చేస్తున్న మేనేజర్, లీగల్ టీమ్, బ్యాంక్ ఏజెన్సీ, ఛార్టెడ్ అకౌంట్ సభ్యులందరూ కలిసి 15 కంపెనీలకు చెందిన వ్యక్తులకు బిజినెస్ లోన్ కింద తక్కువ విలువ గల స్థిర, చరాస్తులను ఎక్కువ వాల్యువేషన్‌గా చూపి లోన్ రూపంలో రూ.27 కోట్లు తీసుకున్నారు. తీసుకున్న లోన్లను రెండేండ్ల వరకు సజావుగానే చెల్లించారు. అయితే సదరు బ్యాంకు ఇంటర్నల్ అధికారులు ఆడిట్ చేయగా అసలు విషయం బయట పడింది. దీనిపై 2021లో రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు నమోదవగా విచారణ చేపట్టారు. లోన్‌కు సంబంధించి అవకతవకలకు పాల్పడిన 12 మందిని మంగళవారం అరెస్ట్ చేసి సంగారెడ్డి కోర్టుకు పంపించినట్టు పోలీసులు తెలిపారు.

సౌర విద్యుత్‌పై.. కేంద్రీకరణ

విద్యుత్ అవసరాలు పెరిగే కొద్దీ వినియోగం రోజు రోజుకూ అధికమవుతోంది. వినియోగానికి తగ్గట్టుగా ఉత్పత్తి లేకపోతే భవిష్యత్ తరాలు అందకారాన్ని చవిచూడాల్సి వస్తది. థర్మల్, జల విద్యుత్‌తో పాటు సౌర విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించాల్సిన అవసరం ఏర్పడింది. ఇటీవల ప్రధాని మోడీ ఓ ప్రకటన చేశారు. దేశ వ్యాప్తంగా కోటి ఇళ్లపై రూట్‌టాప్ సౌర యూనిట్లను ప్రొత్సహించాలనేది ఆ ప్రకటన సారం. ఆ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సౌర యూనిట్ల ఏర్పాటుపై కేంద్రీకరించి పనిచేయాలి. యూనిట్ల ఏర్పాటు గురించి అవగహన కల్పించాలి. యూనిట్ల ఏర్పాటుకు తగిన రాయితీలు, రుణ సదుపాయం కల్పించాలి. ఆ దిశగా ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా మహిళా సంఘాల ద్వారా వెయ్యి సౌర యూనిట్లను ఏర్పాటు చేసేందుకు అధికారులు శ్రీకారం చుట్టారు.

- మహిళా సంఘాల ద్వారా యూనిట్ల ఏర్పాటు
- ప్రొత్సహించేలా అవగహనా కార్యక్రమాలు
- స్త్రీనిధి ద్వారా రుణ సదుపాయం
- అవసరాలకు వినియోగం పోగా మిగులు అమ్ముకునే ఛాన్స్
- ఉమ్మడి మెదక్ జిల్లాలో వెయ్యి యూనిట్ల ఏర్పాటుకు ప్లాన్
- సద్వినియోగం చేసుకోవాలి: మాదవరెడ్డి, ఎస్ఈ



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

విద్యుత్ ఉత్పత్తి పెరిగితే తప్ప వినియోగం మేరకు సరఫరా చేయలేని పరిస్థితులున్నాయి. పరిశ్రమలు, వ్యవసాయం, గృహ వినియోగానికి తగిన విద్యుత్ ఉత్పత్తి లేకపోవడం వల్ల బయటి రాష్ట్రాల నుంచి కొనుగోలు చేయాల్సి వస్తుంది. జల, థర్మల్ విద్యుత్‌పైనే ఆధార పడకుండా సౌర విద్యుత్‌ను కూడా ఉత్పత్తి చేయాల్సిన వసరం అనివార్యమైంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం కలిగే సౌర విద్యుత్ ఉత్పత్తిపై ప్రభుత్వాలు కేంద్రీకరించాల్సిన అవసరముంది. సౌర విద్యుత్ ఉత్పత్తి ప్రయివేట్ సంస్థలు చేస్తున్నాయి. మెదక్ జిల్లాలోని టేక్మాల్, పాపన్నపేట మండలాల్లో వేలాది ఎకరాల్లో సౌర విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో పారిశ్రామికాభివృద్ధి శరవేగంగా జరుగుతుంది. వ్యవసాయ పరంగా కూడా ప్రాజెక్టుల నిర్వహణ, బోరు బావుల మోటర్లకు విద్యుత్ వినియోగం పెరుగుతోంది. ఈ రెండు రంగాలకు అధిక విద్యుత్ వినియోగమవుతున్నందున గృహ అవసరాలకు ప్రత్యామ్నాయ విద్యుత్ చేసుకోవాలి. అందుకు వీలుగా సౌర యూనిట్ల ఏర్పాటు జరగాలి. గృహ అవసరాల నిమిత్తం ఇళ్లపై సౌర పలకలు పెట్టుకుని సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం ద్వారా విద్యుత్ కొరతను అధిగమించే వీలుంది.

1050 యూనిట్ల ఏర్పాటుకు కార్యాచరణ..

సౌర విద్యుత్ ఉత్పత్తిని పెంచే దిశగా ప్రభుత్వాలు అడుగులు వేస్తున్నాయి. ఆ మేరకు ఉమ్మడి మెదక్ జిల్లాలో వెయ్యి యూనిట్లు ఏర్పాటు చేయాలనే లక్ష్యంగా ముందుకు కదులుతున్నారు. సంగారెడ్డి జిల్లాలో 360 యూనిట్లు, సిద్దిపేట జిల్లాలో 350 యూనిట్లు, మెదక్ జిల్లాలో 350 యూనిట్ల చొప్పున ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సౌర విద్యుత్ ఉత్పత్తి పట్ల ప్రజల్లో అంతగా అవగహనలేదు. ముందుగా సమ భావన సంఘాల ద్వారా సౌర యూనిట్లను ఏర్పాటు చేయాలని చూస్తున్నారు. సౌర యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా స్త్రీ నిధి ద్వారా రుణ సదుపాయం కల్పించనున్నారు. ఒక్కో యూనిట్ ఏర్పాటుకు ఇంటిపై సౌర పలకలు ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన వాటి కొనుగోలుకు ప్రత్యేకంగా రుణాలం దిస్తారు. పునరుద్ధరణ ఇందన వనరుల అభివృద్ధి సంస్థ ద్వారా సౌర యూనిట్ల గ్రౌండింగ్ ప్రక్రియను చూస్తున్నారు.

వినియోగం...అమ్మకం

సౌర విద్యుత్ ఉత్పత్తి చేయడం ద్వారా రెండు ప్రయోజనాలు నెరవేరనున్నాయి. ప్రస్తుతం గృహ అవసరాలకు విద్యుత్ వినియోగం విపరీతంగా పెరిగింది. లైట్లు, ప్యాన్, కూలర్స్, ఏసీలు, ప్రిజ్, వాషింగ్ మిషన్, మిక్సీ వాడకం పెరిగింది. దీంతో విద్యుత్ వినియోగం కూడా ఆ మేరకు పెరుగుతూ పోతుంది. విద్యుత్ వినియోగం పెరిగే కొద్దీ కరెంట్ బిల్లు కూడా విపరీతంగా వస్తుంది. నెల నెలా కరెంట్ బిల్లు కట్టకపోతే కనెక్షన్ కట్ అవుతుంది. అందుకే గృహ వినియోగదారులు ప్రతి నెలా కరెంట్ బిల్లుల్ని విధిగా సకాలంలో చెల్లించుకోక తప్పట్లేదు. ఇలాంటి పరిస్థితుల్లో సౌర విద్యుత్ ఉత్పత్తి వైపు దృష్టి సారించాల్సి వస్తుంది. ఇంటిపై సౌర పలకల్ని ఏర్పాటు చేసుకుని విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం ద్వారా రెండు ప్రయోజనాలు చేకూరనున్నాయి. సౌర యూనిటు ఏర్పాటు చేసుకుంటే సోలార్ నెట్ మీట రింగ్ (ఆన్‌గ్రిడ్ సోలార్ ఎనర్జీ సిస్టం) ద్వారా ఉత్పత్తి అయ్యే కరెంట్‌ను ప్రతి నెలా అవసరాలకు వినియోగించుకోవచ్చు. మిగిలిన విద్యుతను విద్యుత్ శాఖ డిస్కింలకు విక్రయించుకునే అవకాశముంది. ఒక యూనిట్‌కు రూ.3.80 ఇచ్చే అవకాశముంది. మరో పక్క సొంత అవసరాలకు విద్యుత్‌ను వినియోగించుకోవడం ద్వారా కరెంట్ బిల్లు కట్టే అవసరం తప్పుతుంది.

సౌర యూనిట్ల ఏర్పాటుకు ప్రొత్సాహకం..

మహిళా సంఘాల ద్వారా సౌర యూనిట్లు ఏర్పాటు చేసుకుంటే టీఎస్‌రెడ్‌కో ఆధ్వర్యంలో సౌర యూనిట్ల ఏర్పాటుకు ప్రొత్సాహం అందించనున్నారు. సౌర యూనిట్‌కు 3 కిలో వాట్‌కు అయితే యూనిట్‌కు 40 శాతం రాయితీపై అందిస్తారు. రాయితీ పోగా మిగతా సొమ్మును సభ్యులు చెల్లించాల్సి ఉంటది. అయితే రాయితీతో పాటు ప్రొత్సాహం అందించేందుకు సౌర యూనిట్ ఏర్పాటు చేసుకునే వాళ్లకు స్త్రీ నిధి ద్వారా రూ.1.60 లక్షల వరకు రుణ సదుపాయం కల్పిస్తారు. అట్టి రుణాన్ని వాయిదా పద్దతిలో చెల్లించుకునే వెసులుబాటు ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి

సౌర విద్యుత్ ఉత్పత్తి చేసుకోవడం ద్వారా మంచి ప్రయోజనం ఉన్నందున అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. సొంత అవసరాలకు వినియోగించుకోవడం ద్వారా కరెంట్ బిల్లు కట్టాల్సిన అవసరం ఉండదు. అదనంగా మిగిలిన విద్యుత్‌ను విద్యుత్ శాఖ డిస్కింకు విక్రయించి ఆదాయం పొందడానికి వీలుంది. సౌర విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు సౌర యూనిట్లు పెట్టుకునేందుకు ముందుకు రావాలి.

\- మాదవరెడ్డి, ట్రాన్స్‌కో ఎస్ఈ సంగారెడ్డి



జర్నలిస్టుకు ఎమ్మెల్యే పల్లా పరామర్శ

నవతెలంగాణ-చేర్యాల

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని ఆకునూరు గ్రామానికి చెందిన జర్నలిస్టు అనుముల నర్సిరెడ్డిని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో చేర్యాల ఎంపీపీ కరుణాకర్,వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం,రాంపూర్ తాజా మాజీ సర్పంచ్ తివారి దినేష్,శివగారి అంజయ్య, అరిగె కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



నూతన సీఐని సన్మానించిన కేవీపీఎస్ బృందం

నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేటకు నూతనంగా వచ్చిన సీఐ బాలస్వామిని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) బృందం మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి.. శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపింది. అనంతరం కేవీపీఎస్ ఆధ్వర్యంలో మహనీయుల ఫోటోలతో ముద్రించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను, మహనీయుల జీవిత చరిత్ర ఘట్టాలను, ముఖ్యమైన చట్టాలను ముద్రి స్తూ తెచ్చిన డైరీని అందించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పి.అశోక్, మండలాధ్యక్షులు టి.మల్లేశం, కార్యదర్శి ఎన్ మహేష్, నాయకులు ప్రభుదాస్, ఆనంద్, సురేష్, పవన్, శ్రీనివాస్ అరవింద్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం), ప్రజాసంఘాల నుంచి చిరంజీవి బహిష్కరణ

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

పార్టీ క్రమశిక్షణ, నైతిక విలువలు పాటించకుండా అనైతికంగా వ్యవహరించడంతో చిరంజీవిని సీపీఐ(ఎం), ప్రజా సంఘాల నుంచి బహిష్కరిస్తున్నట్టు సీపీఐ(ఎం) నారాయణఖేడ్ ఏరియా కార్యదర్శి అతిమేల మానిక్ తెలిపారు. ఖేడ్‌లో మంగళవారం జరిగిన శాఖ సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవ తీర్మా నం జరిగిందన్నారు. చిరంజీవిని గతంలోనే పార్టీ పదవులనుంచి తొలగిం చిన ప్పటికీ..నేడు పార్టీ సభ్యత్వం, ప్రజాసంఘాల నుంచి బహిష్కరిస్తున్నట్టు తెలిపారు. ఇకమీదట పార్టీకి, ప్రజాసంఘాలకు చిరంజీవికి ఎటువంటి సంబంధం లేదన్నారు.



నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వ ర్యంలో విద్యాశాఖ అధికారి విశ్వనాథ్‌కి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కిందిదొడ్డి సతీష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు అశోక్, ఏఐఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ కుమార్ మాట్లా డుతూ.. నారాయణఖేడ్ పట్టణ కేంద్రం లోని ప్రయ ఎవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టాను సారంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కనీసం టెట్, బీఎడ్ అర్హతలు లేని వారిని టీచర్స్‌గా పెట్టుకుని పాఠ శాలలు నడు తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా స్థానిక మండల విద్యా శాఖ అధికారులు స్పందించి.. అలాంటి పాఠశాలలపై వెం టనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పవన్, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఇసాక్, ఏఐఏ ఫ్డీఎస్ నాయకులు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



పలు సూచనలు పాటిస్తే శెనగలో అధిక దిగుబడి సాధ్యం

నవతెలంగాణ-జహీరాబాద్

పలు సూచనలు పాటిస్తే శెనగ పంటలో అధిక దిగుబడి సాధ్యమని ఏరువాక శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ అన్నారు. జహీరాబాద్ మండలం రంజోల్ గ్రామంలో ఏరు వాక కేంద్రం సంగారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం శెనగ పంటలో క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ ప్రదర్శన క్షేత్రంలో ఎంటీజీ(నంద్యాల శనగ) 452 రకం శెనగ విత్త నాన్ని రైతు రాములు పొలంలో ప్రదర్శన నిమిత్తం సాగు చేయించారు. ఈ రకం విత్తనం ఎండు తెగులు తట్టు కుం టుందని, అధిక పిలుకలతో ఎక్కువ మొత్తంలో కాయలు ఏర్పడి దిగుబడి కూడా మంచిగా వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ విత్తనాన్ని మిగతా రైతులు కూడా సేకరి ంచుక ని వచ్చే సీజన్లో సాగు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ సరిత, వ్యవసాయ విస్తరణాధికారి ప్రదీప్ కుమార్, రైతులు శేఖర్, రామకృష్ణ, జగన్, మల్లేశం, రాములు, వెంకట్, పండరి, కిష్టన్న, శంకర్, శేఖర్ పాల్గొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-దౌల్తాబాద్

మండల పరిధిలోని ఇంద్రుప్రియల గ్రామానికి చెందిన మహమ్మద్ అబ్దుల్ పాషా(35), భార్య అషు బేగం, పిల్లలతో మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లో 8 నెలలుగా నివాసముంటున్నాడు. వారు వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించు కునేవారు. కాగా అబ్దుల్ పాషా గత ఐదేండ్ల నుంచి విపరీతంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి భర్యాతో గొడవ పెట్టుకుని.. దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ
- బొగులంపల్లి ఎత్తిపోతల పథకం అదనపు గ్రావిటీ కెనాల్ పనులు ప్రారంభం
- రూ.30 లక్షలతో కర్చల్-బొగులంపల్లి ప్రాజెక్టు మెటల్‌రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

నవతెలంగాణ-రాయికోడ్



రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల పరిధిలోని బొగ్గులంపల్లి ఎత్తిపోతల అదనపు గ్రావిటీ కెనాల్ పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత 12 ఏండ్ల క్రితం రూ.18 కోట్లతో బొంగులంపల్లి ఎత్తిపోతల పథకం ను నిర్మిస్తే.. దాన్ని పట్టించుకునేవారు లేక శిథిలావస్థకు చేరిందన్నారు. మోటార్లు దొంగలు ఎతుకెళ్లారని దుయ్యబట్టారు. రైతుల శ్రేయస్సు కోసం తిరిగి ఈ ఎత్తిపోతల పథకం నడవడానికి వీలుగా రాయికోడ్ మండలంలోని ఆరు గ్రామాలకు చెందిన 1250 మంది రైతుల 2600 ఎకరాల పంట పొలాలకు సాగునీరు అందించడానికి రెండుకోట్ల 16 లక్షలతో ఎత్తిపోతల పథకం మరమ్మత్తు పనులు అదనపు గ్రావిటీ పైప్‌లైన్‌లో ఏర్పాటుకు పనులు చేపట్టినట్లు తెలిపారు. నెల రోజుల్లో ఈ పనులన్నీ పూర్తవుతాయన్నారు. ఈ ఎత్తిపోతల పథకం సవ్యంగా పనిచేయాలంటే ఆరు గ్రామాలకు చెందిన రైతులు కలిసి కమిటీని ఏర్పాటు చేసుకొని కమిటీ ద్వారా ఎత్తిపోతల పథకం ను నడిపించాలన్నారు. ఎత్తిపోతల పథకానికి సంబంధించిన 1250 మంది రైతులతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని అవసరమైతే తాను కూడా సమావేశానికి వస్తానన్నారు. త్వరలో బుదేరా నుంచి సిరూరు వరకు రెండులైన్ల ఆర్అండ్‌బీ రోడ్డు ఏర్పాటు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ రోడ్డు ఏర్పాటుతో రాయికోడ్ మండలంలోని సింగూరు తీర గ్రామాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ ప్రాంతం పర్యాటక పరంగా కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ రోడ్డు ఏర్పాటుతో రిసార్టు సైతం ఈ ప్రాంతంలో ఏర్పాటయ్యే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా సింగీతం, గ్రామంలో రెండున్నర కోట్ల, రాయికోడ్ ఎక్స్‌రోడ్ వద్ద 20 లక్షలతో ఎన్‌హెచ్ఎం నిధులతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కర్చల్ సబ్ స్టేషన్ నుంచి బొంగులంపల్లి ప్రాజెక్టు వరకు రూ.30 లక్షలతో నిర్మించనున్న మెటల్‌రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అల్లపూర్ నుండి షాంశుద్దీన్ పూర్ వరకు 70 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రాయికోడ్ లోని మోడల్ స్కూల్ వద్ద సిసి రోడ్ల నిర్మాణానికి మార్కెట్ కమిటీ నిధులతో చేపట్టనున్న మెటల్‌రోడ్డు నిర్మాణానికి, రాయికోడ్ ఎక్స్ రోడ్ వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్ భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాయికోడ్ మోడల్ స్కూల్ పాఠశాల విద్యార్థులతో మంత్రి సమావేశమయ్యారు. వారి సమస్య లను అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకొని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖరరావు, జిల్లా పరిషత్ సీఈవో జానకి రెడి, ఎస్ఈ ఇరిగేషన్ మురళీధర్, డిఎంహెచ్వో గాయత్రి, జహీరాబాద్ ఆర్డీవో రాజు, ఎంపీపీ మమత అశోక్, జెడ్పీటీసీ మల్లికార్జున్ పాటిల్, బ్లాక్ కాంగ్రెస్ అధ్య క్షులు అంజయ్య కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు నర్సింలు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ యేసయ్య నాయకులు సతీష్ కులకర్ణి ఆ గ్రామాల మాజీ సర్పంచ్లు శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపల్ రజిని కుమారి, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో విజయం సాధించాలి

నవతెలంగాణ-సిద్దిపేట

పాండిచ్చేరిలో జరిగే జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో విజయం సాధించి జిల్లాకు పేరు తీసుకురావాలనీ జడ్పీ చైర్ పర్సన్ రోజా శర్మ కోరారు. హైదరాబాద్ బీహెచ్ఈఎల్‌లో జరిగిన థర్డ్ ఫేస్ కేలో ఇండియా ఫస్ట్ తైక్వాండ సెలక్షన్ లీగ్‌లో సిద్దిపేట జిల్లా తైక్వాండో అసోసియేషన్ పట్టణానికి చెందిన విద్యార్థిని కంతుల పూజ, జూనియర్ విభాగంలో అండర్ 42 కేజీల విభాగంలో విజయం సాధించి ఈనెల 27 నుండి మార్చి 2 వరకు పాండిచ్చేరిలో జరిగే కెలో ఇండియా థర్డ్ ఫేస్ తైక్వాండో పోటలకు వెళ్ళనుంది. ఈ సందర్భంగా జిల్లా చైర్ పర్సన్ వేలేటి రోజా రాధాకష్ణ శర్మ, జిల్లా తైక్వాండో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు రాధాకష్ణ శర్మ ఉపాధ్యక్షులు డాక్టర్ పి రామోహన్ కెలో ఇండియాకు సెలెక్ట్ ఆయన పూజను అభినందించారు. ఈ కార్యక్రమంలో రమేష్, జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి రాచకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళలు సమస్యలపై ఉద్యమించాలి

- ఐద్వా కేంద్ర కమిటి సభ్యురాలు కె.అశాలత పిలుపు

నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్



సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్యంగా ఉద్యమించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) కేంద్ర కమిటి సభ్యురాలు కె.ఆశాలత పిలుపునిచ్చారు. బుధవారం ఐద్వా జిల్లా విస్తత స్థాయి సమావేశం సిద్దిపేటలోని సంఘం కార్యాలయంలో జాలిగపు శిరీష అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఆశాలత మాట్లాడుతూ పాలక వర్గాలు అనుసరిస్తున్న విధానాల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. దీంతో కనీసం రెడు పూటలా తిండికి కూడా దూరమయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. దేశంలో మహిళలపై రోజురోజుకు దాడులు, హత్యలు, అత్యాచారాలు, గహ హింస పెరిగి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని అరికట్టాల్సిన పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పోరాటం చేసి సాధించుకున్నామన్నారు. ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా బడ్జెట్లో నిధులు తగ్గించి ఉపాధి హామీ పథకం నుండి కూలీలను దూరం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. పాలకులు అనుసరిస్తున్న మహిళా వ్యతిరేఖ విధానాలపై పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఐద్వా జిల్లా కార్యదర్శి అత్తిని శారద, ఇప్పకాయల శోభ, బద్దిపడిగే విగ్నేశ్వరీ, నక్క పద్మ, దాసరి పద్మ, కనకవ్వ, ఎల్లారం రేవతి, భాగ్యలక్ష్మి, జయశ్రీ, ఉపేంద్ర, వరలక్ష్మి, లక్ష్మి పాల్గొన్నారు.

ఓటర్ జాబితాలో తప్పిదాలు లేకుండా పరిశీలన జరపాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిలి వికాస్‌రాజ్

నవతెలంగాణ-సిద్దిపటకలెక్టరేట్



ఓటరు జాబితాలో తప్పిదాలకు ఆస్కారం లేకుండా పకడ్బందీ పరిశీలన జరపాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ సూచించారు. పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, రిటర్నింగ్ అధికారులతో సమీక్ష జరిపారు. పెండింగ్‌లో ఉన్న ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను రోజువారీగా పరిశీలిస్తూ పరిష్కరించేలా పర్యవేక్షణ జరపాలని సూచించారు. వాటిని ఆన్లైన్‌లో అప్‌లోడ్ చేయించాలన్నారు. కొత్తగా నమోదైన ఓటర్లకు నిర్దిష్ట గడువులోపు గుర్తింపు కార్డులు చేరేలా పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ-ఓటరు ఐ.డీని హెల్ప్ లైన్ యాప్ ద్వారా డౌన్ లోడ్ చేసుకోవచ్చుననే విషయాన్ని ఓటర్లకు తెలియజేస్తూ విస్తత ప్రచారం చేయాలన్నారు. అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను జాగ్రత్తగా గుర్తించాలన్నారు. వయో వద్దులు, సెక్స్ వర్కర్లు, దివ్యంగులైన ఓటర్లను గుర్తించేందుకు వారు పోలింగ్‌లో పాల్గొనేలా ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలాన్నరు. క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వే జరిపించాలన్నారు. పోలింగ్, కౌంటింగ్ ఏర్పాట్లు, సిబ్బంది నియామకం, శిక్షణ తరగతులను నిర్వహించాలన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో తప్పకుండా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమీకత జిల్లా కార్యాలయ సముదాయం నుండి జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డిఆర్ఓ నాగరాజమ్మ, ఎలక్షన్స్ సూపరిడెంట్ మధుసూదన్, ఎలక్షన్ డిటీ శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు.

తేర్పోల్ నుంచి గణేష్‌గడ్డ వరకు పాదయాత్ర

నవతెలంగాణ-కొండాపూర్

సంగారెడ్డి ఎమ్మెల్యేగా చింతా ప్రభాకర్ గెలిస్తే గణేష్ గడ్డ వరకు పాదయాత్రగా వస్తామని పలువురు కొండాపూర్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మొక్కుకున్నారు. ఈ నేపథ్యంలో సంగారెడ్డి ఎమ్మెల్యేగా చింతా ప్రభాకర్ గెలవడంతో.. మండలంలోని తేర్పోల్ నుంచి గణేష్‌గడ్డ దేవాలయం వరకు మంగళవారం పాదయాత్ర చేసి మొక్కులు తీరుచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాదయాత్ర చేసిన వారిలో తేర్పోల్ ఎంపీటీసీ గీత మోహన్ గౌడ్, ఆత్మ కమిటీ డైరెక్టర్ శేఖర్, గ్రామ యూత్ అధ్యక్షులు, నారాయణ, గణేష్ గౌడ్, దీక్షిత్, శ్రీనివాస్ రెడ్డి, భారత్ వినోద్‌గౌడ్, నందుగౌడ్, నిఖిల్ గౌడ్, శశిధర్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో కసాల బుచ్చిరెడ్డి, పార్టీ మండలాధ్యక్షులు విఠల్, సంతోష్ రెడ్డి, సుధీర్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.



భవితంతా కృత్రిమ మేధదే..

- జనరేటివ్ ఏఐ వర్క్‌షాప్‌లో నెక్స్‌వేవ్ గ్రోత్ మేనేజర్ ప్రశాంత్

నవతెలంగాణ-పటాన్‌చెరు



భవిష్యత్తు సాంకేతికతలో కృత్రిమ మేధ (ఏఐ) కీలక భూమిక పోషించబోతోందని, విద్యార్థి దశ నుంచే దానిపై పట్టు సాధించాలని నెక్స్‌వేవ్ గ్రోత్ మేనేజర్ ప్రశాంత్ ఏఆర్ స్పష్టీకరించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని కోగాన్ (సాంకేతిక మెళకువలను ప్రోత్సహించే విద్యార్థి విభాగం) మంగళవారం నిర్వహించిన ఒకరోజు 'జెనరేటివ్ ఏఐ వర్క్‌షాప్'లో ఆయన ప్రధాన వక్త, శిక్షకుడిగా పాల్గొన్నారు. గీతమ్‌లోని స్టూడెంట్ లెఫ్, అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ ఏఐఈఎస్ఈసీల సంయుక్త సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్య శాలలో వివిధ రంగాల్లో కృత్రిమ మేధ సాధనాలు, వాటి వినియోగంపై సమగ్ర అవగాహన కల్పించేందుకు ప్రయత్నించారు. ఏఐ టూల్స్, ఆచరణాత్మక అభ్యాసం, చాట్ జీపీటీ వంటి వాటిపై ఆయన గీతం విద్యార్థులకు ప్రాథమిక అవగాహన కల్పించారు. వేగవంతమైన వృద్ధి, మంచి సామర్థ్యాన్ని సమకూర్చుకోవడం కోసం కృత్రిమ మేధ సాధనాల వినియోగంపై విద్యార్థిగా ఉన్నప్పటి నుంచే పట్టు సాధించాలని సూచించారు. వాటి జీపీటీ, సూపర్ ఛార్జ్ కంటెంట్ క్రియేటర్, సర్రెక్సిటీ ఏఐ, దాల్-ఈ, డ్రీమ్ వార్స్, రన్ని ఎంఎల్, పోరా, క్లిప్ చామ్ వంటి పలు రకాల కృత్రిమ మేధ సాధనాలను గీతం విద్యార్థులకు ప్రశాంత్ పరిచయం చేశారు. అలాగే ఫ్రీమర్, హెూస్టింగర్ వంటి ఏఐ సాధనాల గురించి కూడా వివరించారు. ఈ సాధనాల గురించి మంచి అవగాహన ఏర్పరచుకుని, వాటిపై ఆవరణాత్మక ప్రయోగాలు చేయాలంటూ వారిని ప్రోత్సహించారు. ఈ కార్య శాలలో విద్యార్థులు కృత్రిమ మేధ సాంకేతికత, భవిష్యత్తు, వివిధ పరిశ్రమలలో దాని వినియోగం వంటి అంశాలపై విద్యార్థులు లోతైన అవగాహనను ఏర్పరచుకున్నారు. వాటి పై మరింత అవగాహన, ఉత్సుకతలను పెంపొందించడానికి ప్రశాంత్ కొన్ని వీడియోలు చూపుతూ, వాటిపై లోతుగా ఆలోచించి, ప్రశ్నలుఅడిగేలావిద్యార్థులను ప్రోత్సహించారు.

నవతెలంగాణ
నమ్మదగ్గ తెలుగు దినపత్రిక
సంగారెడ్డి
2
బుధవారం | 21 ఫిబ్రవరి 2024 | www.navatelangana.com

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..

నవతెలంగాణ-కొండాపూర్



మండల పరిధిలోని దొబ్బకుంటా ప్రభుత్వ పాఠశాలలో స్వయం పరిపాలనా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు బోధించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పావని, మండల విద్యాధికారిగా పవన్, ఉపాధ్యాయులుగా పవన్, ఏ.రాజు, వరలక్ష్మి, హిమబిందు, అర్చన, విష్ణు, చరణ్‌రాజ్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి భీమ్‌సింగ్, కొండాపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎలిజబెత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉషారాణి, ఉపాధ్యాయులు భీమయ్య లక్ష్మణ్, సీఆర్పీ ఆనందం, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థిత్వానికి చింతా ప్రభాకర్ మద్దతు కోరిన ప్రభుగౌడ్

నవతెలంగాణ-సంగారెడ్డి



సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను సంగారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మెన్ ప్రభుగౌడ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మెదక్ ఎంపీ సీటు అభ్యర్థిత్వానికి మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందజేశారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిం చారని ప్రభు గౌడ్ అన్నారు. ఈ ప్రతిపాదనను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని చెప్పినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, వెంకటేశం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రేసులో ఐదుగురు

- జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ టికెట్ కోసం ఐదుగురు ఆశావాహులు
- పోటాపోటీగా కటౌట్లు, వాల్ పోస్టర్లు, ఫ్లెక్సీల ఏర్పాటు
- ఎన్నికల ప్రచారాన్ని తలపిస్తున్న నేతల హడావిడి

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ జహీరాబాద్ ఎంపీ టిక్కెట్ కోసం ఐదుగురు ఆశావాహులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికల ప్రచారాన్ని ఏమాత్రం తీసుపోనీయకుండా హడావిడి చేస్తున్నారు. ఆఖరికి శుభాకార్యాలకు హాజరైన చోట కూడా రాజకీయ ఎత్తుగడలే కొనసాగిస్తున్నారు. ఒకరిని మించి మరొకరు పోటాపోటీగా కటౌట్లు, వాల్‌పోస్టర్లు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. అధిష్టానం దృష్టిలో పడేలా ఎత్తుగడలు వేస్తున్నారు.



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ పార్టీ నుంచి టిక్కెట్ కోసం మాజీ ఎంపీ సురేష షెట్కార్, ఒకవేళ తనకు ఇతర సముచిత స్థానం లభిస్తే తన కూతురు గిరిజా షెట్కార్, కామారెడ్డి నుంచి ఏనుగు రవీందర్‌రెడ్డి, మంత్రి దామోదర్ కూతురు త్రిష, జహీరాబాద్ మాజీ ఎంపీపీ నారాయణరెడ్డి కుమారుడు ఎన్ఆర్ఐ ఉజ్వల్‌రెడ్డిలు పోటీలో ఉన్నట్టు సమాచారం. అయితే ఈ ఐదుగురిలో సురేష్ షెట్కార్ గతంలో జహీరాబాద్ పార్లమెంట్ ఏర్పడిన తర్వాత 2009లో మొదటిసారి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఘన విజయం సాధించారు. అప్పటి నుంచి ప్రజా క్షేత్రంలో ఉంటూ.. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్నారు. ఎంపీ నిధులతో పార్లమెంట్ పరిధిలోని పలు నియోజకవర్గాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేసి ప్రజల మనసును గెలుచుకున్నాడు. అయితే రాష్ట్ర ఏర్పాటు తర్వాత ప్రజలు 2104, 2019లో వరుసగా రెండుసార్లు బీఆర్ఎస్ అభ్యర్థి బీబీ పాటిల్‌కు పట్టం గట్టారు.అయినప్పటికీ పదవి ఉన్నా లేకపోయినా.. మాజీ ఎంపీ సురేష్ షెట్కర్ (కాంగ్రెస్) ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడుతున్నాడు. ఎంపీ టిక్కెట్ రేసులో ఆయనే మొదటి స్థానంలో ఉండగా.. టికెట్ కూడా ఆయనకే కట్టబెట్టే అవకాశాలు పు ష్కలంగా కనిపిస్తున్నాయి. ఒకవేళ ఒకవేళ సురేష్ షెట్కార్‌కు ఎంపీ టికెట్ కాకుండా పార్టీలో ఇతర సముచిత స్థానం కల్పిస్తే.. తన కుమార్తె గిరిజా షెట్కార్ కూడా టికెట్ రేసులో ఉంటారు. వారు కాకుండా కామారెడ్డి నుంచి ఏనుగు రవీందర్‌రెడ్డి కూడా టిక్కెట్ కోసం గట్టి ప్రయత్నాలే చేస్తున్నారు.

అలాగే రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి కుమార్తె త్రిష దామోదర్ కూడా టిక్కెట్ రేసులో ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం. ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు కూడా చేసుకున్నట్టు తెలిసింది. తన కూతురును పార్లమెంట్ టికెట్ ఇప్పించి రాజకీయ రంగ ప్రవేశం చేయించాలన్న ఉత్సాహంలో దామోదర్ రాజనర్సింహ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. జహీరాబాద్ పార్లమెంట్ టికెట్ కోసం నలుగురు కాకుండా ప్రజాక్షేత్రంలో లేని ఎన్నారై డాక్టర్ ఉజ్వల రెడ్డి ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. ఇప్పటికే పార్టీ అధిష్టానం సూచనతో అమెరికాలోని తన కుటుంబాన్ని వదిలి జహీరాబాద్ పార్లమెంట్ పార్టీ అబ్జర్వర్‌గా ఉంటూ వివిధ రకాల సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఎన్నికల సమయం సమీపిస్తున్న వేళ పార్లమెంట్ నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు, మెడికల్ క్యాంపులు, క్రీడా పోటీలు నిర్వహిస్తూ పలు కార్యక్రమాల్లో హల్చల్ చేస్తూ ఓటర్లను మచ్చిక చేసుకోవాలని చూస్తున్నారు. ఏది ఏమైనాప్పటికీ పార్టీ అధిష్టానం మాత్రం జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ టికెట్‌ని బీసీ సామాజిక వర్గం (లింగాయత్) అయిన సురేష్ షెట్కార్‌కు కేటాయించాలని నిర్ణయం తీసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ సురేష్ షెట్కార్‌కు నారాయ ణఖేడ్ టికెట్ కేటాయించి చివరి క్షణంలో సంజీవరెడ్డికి మార్పు చేశారు. కాగా అప్పుడు టీపీసీసీ అధ్యక్షుడు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయాన సురేష్ షెట్కార్ ఎంపీ టికెట్ కేటాయిస్తానని హామీ ఇచ్చినట్టు సమాచారం.



ఘనపురం ఆయకట్టకు సింగూరు నీటి విడుదల

నవతెలంగాణ-పుల్కల్

ఘనపురం ఆయకట్ట కింద రైతులు సాగుచేసిన వరి పంట కోసం సింగూరు ప్రాజెక్టు నుంచి ఇరిగేషన్ శాఖ అధికారులు మంగళవారం 1460 క్యూసెక్కుల నీటిని జల విద్యుత్ ఉపకేంద్రం ద్వారా దిగువకు విడుదల చేశారు. ఆయకట్ట కింద ఉన్న రైతులు ఈ నీటిని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు తెలిపారు. అలాగే మంజీర పరిహాక ప్రాంత ప్రజలు, గొల్ల కాపరులు, మత్స్యకారులు మంజీరావైపు వెళ్లొద్దని సూచించారు.కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

అందోల్ తహసీల్దారుగా భాస్కర్‌కుమార్



నవతెలంగాణ-జోగిపేట

అందోల్ మండల నూతన తహసీల్దారుగా భాస్కర్ కుమార్ మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గతంలో పుల్కల్ మండల తహసీలార్‌గా పనిచేసిన ఆయన.. బదిలీపై అందోల్‌కు వచ్చారు. ఇంతకుముందు ఇక్కడ పనిచేసిన తహసీలర్ ఆంటోనీ ఆర్డీవో కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా భాస్కర్ కుమార్ మాట్లాడుతూ.. మండలంలో రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలను అందిస్తానన్నారు. ఆయన వెంట ఉప తహసీల్దార్ మధుకర్ రెడ్డి ఉన్నారు.



పుల్కల్ తహసీల్దార్‌కు ఘన సన్మానం

నవతెలంగాణ-పుల్కల్

పుల్కల్ నూతన తహసీల్దార్ కృష్ణను బీఆర్ఎస్ నాయకులు శాలువా, పూలమాలలతో మంగళవారం ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో పుల్కల్ ఎంపీటీసీ శ్రీనివాస్ చారి, ఆత్మ కమిటీ డైరెక్టర్ చిట్టెపు వీరారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సుభాష్, చందర్, ఆయా గ్రామాల నాయకులు ఉన్నారు.



గ్రామాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

నవతెలంగాణ-పుల్కల్

ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తున్నదని పార్టీ మండలాధ్యక్షులు దుర్గారెడ్డి అన్నారు. ఎస్ఆర్ఈజీఎస్ కింద రూ.15లక్షలతో మండల కేంద్రంలో సీసీరోడ్డు పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో గ్రామాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే ప్రతీ గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ డైరెక్టర్ రాంచంద్రారెడ్డి, లక్ష్మారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ బచ్చు మాణిక్యం, యూత్ మండల అధ్యక్షులు ఉదయ్ కుమార్, మాజీ సర్పంచ్ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు



ఘనంగా భీష్మ ఏకాదశి

నవతెలంగాణ-సంగారెడ్డి

గంజి మైదానం ఫిష్ మార్కెట్‌లో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గంగాపుత్ర అధ్యక్షుడు కూన సత్తయ్య, కార్యదర్శి మిర్దొద్ది కిష్టయ్య, మత్యశాఖ అధ్యక్షుడు మిర్దొడ్డి నగేష్, ప్రధాన కార్యదర్శి కూన చిదంబర సాయి,ఉపాధ్యక్షులు గుర్రం నరసింహరాజు కార్యవర్గం సభ్యులు గుర్రం నగేష్, కాడబాయిన అశోక్, గుంటి వంశీ, భీష్మ యూత్ అధ్యక్షులు నరేష్, సంఘం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



సరస్వతి మాత మండపంలో ప్రవీణ్‌రెడ్డి ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపల్ పరిధిలోని లక్ష్మీనగర్‌లో వసంత పంచమి సందర్భంగా ఏర్పాటు చేసిన సరస్వతి మాత మండపంలో స్థానిక కాంగ్రెస్ యువత నాయకులు వి.ప్రవీణ్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహి ంచారు. అనంతరం ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ... సరస్వతి మాత కృపా కటాక్షాలతో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రతి యేటా ఉత్సవాలను చేపడుతున్న నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం నిర్వాహకులు నాయకులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీకాంత్ రెడ్డి, సతీష్, సురేష్, రంజన్, దిలీప్, కృష్ణ, సునీల్, రాహుల్, సాహెబ్, రాజన్, సన్నీసందీప్, సిద్దు,సోను, సూరజ్, రవి, కాలనీ యువకులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవాలని డీఈవో వెంకటేశ్వర్లు అన్నారు. సంగారెడ్డిలోని జిల్లా సైన్స్ కేంద్రంలో ఎఫ్‌పీఎస్‌టీ, టీబీఎస్ఎఫ్‌ల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్-2024 నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంగారెడ్డి జిల్లా డీఈఓ వెంకటేశ్వర్లు హాజరై.. విజేతలకు సర్టిఫికేట్లు, షీల్డులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సైన్స్ టాలెంట్ పరీక్షలు విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీస్తాయని, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తాయన్నారు. ఈ పోటీలో న్యాల్కల్ మండలంలోని జెడ్పీహెచ్ఎస్ మీర్జాపూర్(బి)కి చెందిన సాదియ నౌశీన్ ప్రథమ స్థానం, రాయికోడ్ మండలంలోని టీఎంఎస్‌కు చెందిన నిజామొద్దిన్ ద్వితీయ స్థానం, పటాన్‌చెరు జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన భవానీ తృతీయ స్థానం సాధించారు.కాగా విజేతలను డీఈఓ అభినందించారు. వారు ఈనెల 24న రాష్ట్రస్థాయి సైన్స్ టాలెంట్ టెస్టులో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి, సంగారెడ్డి అండ్ కంది మండలాల ఎంఈఓ వెంకట నరసింహ గౌడ్, ఎఫ్‌పీఎస్‌టీ జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి మురళీధర్ , ప్రధాన సలహాదారు పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.మదన్ గోపాల్, జిల్లా బాధ్యులు రాజునాయక్, నరేందర్, రమేష్, రాములు, అశోక్ రెడ్డి, టీబీఎస్ఎఫ్ అధ్యక్షులు మురళి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి జేవీవీ పోటీల్లో అందోల్ విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-జోగిపేట

జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో సైన్స్ సంబరాలు-2024కి గాను జిల్లా స్థాయిలో నిర్వహించిన చెకుముకి పోటీల్లో అందోల్ మండల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మండల పరిధిలోని పోసానిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల చెందిన విద్యార్థులు కృష్ణవేణి, పల్లవి, శివ కుమార్ బృందం, జోగిపేట పట్టణంలోని సాయి కృష్ణవేణి ఉన్నత పాఠశాలకు చెందిన హరిచారి, సాయి వర్షిని, కార్తీక బృందం విద్యార్థులు జిల్లా స్థాయిలో చక్కటి ప్రతిభ కనబరిచి బహుమతులు అందుకున్నారు. సంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లాస్థాయి చెకుముకి పోటీల్లో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు చేతుల మీదుగా వారు జ్ఞాపిక, సర్టిఫికెట్లు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ,జిల్లా జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు ప్రతాప్ కుమార్,ప్రధాన కార్యదర్శి జాన్‌పాల్, జిల్లా భాద్యులు మహేష్ కుమార్ చారి, ప్రశాంత్, శశిధర్, బాలయ్య, జగన్, సోమశేకర్ పాల్గొన్నారు.

అక్రమంగా మొరం తరలిస్తున్న జేసీబీ, రెండు ట్రాకర్లు సీజ్



నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేట పట్టణంలోని డబుల్ బెడ్ రూమ్ వెనక గల ప్రభుత్వ భూమిలో కొందరు గత కొన్ని రోజులుగా అక్రమంగా మొరంను తరలిస్తూ మూడు పువ్వులు ఆరు కాయలుగా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా దందా చేస్తున్నారు. ఈ విషయం తెలిసి.. రెవెన్యూ సిబ్బంది, ఆర్ఐ గణేష్ తన బృందంతో మంగళవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అక్రమంగా మొరం తరలిస్తున్న ఒక జేసీబీ, రెండు ట్రాకర్లను పట్టుకుని సీజ్ చేశారు. డబుల్ బెడ్ రూమ్‌ల్లో నివాసముంటున్న పలువురు మాట్లాడుతూ.. పట్టుబడిన ఈ రెండు ట్రాక్టర్లే కాకుండా, రాత్రి వేళలో హిటాచి, జేసీబీలు, టిప్పర్లతో మొరంను భారీగా తరలిస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రాత్రి వేళల్లో మొరం తరలింపును అడ్డుకొని.. వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి..

అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న మొరం వ్యాపారంతో ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి పడుతున్నది. మొరం, ఇసుక వ్యాపారం చేయాలంటే మైనింగ్ శాఖ నుంచి అనుమతులు తీసుకొని రెవెన్యూ, పోలీసులకు సమాచారం ఇవ్వాలనేది నిబంధన. కానీ సదాశివపేట మండలంలో కొందరు నిబంధనలను తుంగలో తొక్కి దర్జాగా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.

రసవత్తంగా న్యాల్కల్ కుస్తీ పోటీలు

- 40 మంది పోటీ పడగా.. విజేతగా నిలిచిన మహారాష్ట్ర వాసి

నవతెలంగాణ-న్యాల్‌కల్



మండలంలోని పీర్ గైబ్ సాహెబ్ దర్గా జాతరలో భాగంగా ఐదో రోజైన మంగళవారం జరిగిన కుస్తీ పోటీలు ఆద్యాంతం రసవత్తరంగా సాగాయి. ఎన్నో ఏండ్లుగా న్యాల్కల్ జాతరలో కుస్తీ పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ పోటీలను తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలే కాకుండా.. ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద ఎత్తున తరలివచ్చారు. బీఆర్ఎస్ న్యాల్‌కల్ మండల నాయకుడు ముంగి సయ్యద్ షకీల్ కుస్తీ పోటీల్లో ఫైనల్ గెలిచిన మల్లయోధులకు ప్రతీయేడు నగదు అందజేస్తున్నారు. కాగా మంగళవారం జరిగిన కుస్తీ పోటీల్లో కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ నుంచి మొత్తం 40 మంది పైల్వాన్‌లు తలపడ్డారు. మహారాష్ట్రలోని కోలాపూర్ గ్రామానికి చెందిన లింగారాజు అనే యువకుడు ఈ కుస్తీ పోటీలో విజేతగా నిలిచాడు. అతనికి ముంగి సయ్యద్ షకీల్ తన సొంతంగా రూ.20,051 నగదును అందజేశారు. గెలిచిన వారికి 10 తులాల వెండి కడియంను జెడ్పీటీసీ స్వప్న భాస్కర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ రోహిత్, మండల నాయకుడు సయ్యద్ షకీల్, ఉత్సవ కమిటీ సభ్యులు యూనుస్ ఖాన్, బద్రు స్వామి, బసవరాజ్, వెంకట్, శివ స్వామి, మకుసూద్ అలీ తదితరులున్నారు.





మహిళ దినోత్సవ వేడుకలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో మార్చి 10న నిర్వహించే సార్వజనిక అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల ఆహ్వాన పత్రికను క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు మంగళవారం అందజేశారు. అంతకుముందు ఆయన్ను శాలువాతో ఘనంగా సన్మానించారు. కాగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్టుతెలిపారు. వీరశైవ లింగాయత్ మహిళలు పాల్గొన్నారు.



జాతీయస్థాయి వెయిట్ లిఫ్ట్‌లో కొండాపూర్ విద్యార్థి ప్రతిభ

నవతెలంగాణ-కొండాపూర్

ఇటీవలే పాట్నా(బీహార్)లో జరిగిన జాతీయ స్థాయి వెయిట్‌లిఫ్ట్ పోటీల్లో కొండాపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి నందిని పాల్గొని జాతీయస్థాయిలో గెలుపొందింది. ఈ సందర్భంగా ఆ విద్యార్థిణి, శిక్షణ ఇచ్చిన పీఈటీ పాండును పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎలిజబెత్, ఉపాధ్యాయ బృందం, ఎంఈఓ బీమ్‌సింగ్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ్‌బాబుపై చర్యలు తీసుకోవాలి
- సీఐటీయూ ఆధ్వర్యంలో అడిషనల్ డైరెక్టర్ శ్రీధర్‌కు వినతి

నవతెలంగాణ-సంగారెడ్డి



సంగారెడ్డి మున్సిపాల్టీలో అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, అక్రమాలకు పాల్పడుతున్న అదనపు శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ్‌బాబుని ఉద్యోగం నుంచి తొలగించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో హైదరాబాద్ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. అనంతరం అడిషనల్ డైరెక్టర్ శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ.. సానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విజయ బాబు వచ్చిన తర్వాత.. గత 20 ఏండ్ల నుంచి సంగారెడ్డి మున్సిపల్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను అనేక మందిని కనీసం నోటీసులు ఇవ్వకుండా తొలగించాడని ఆరోపించారు. తొలగించిన కార్మికుల స్థానంలో లక్షల రూపాయిలు తీసుకొని అనేక మందికి ఉద్యోగాలు కూడా ఇచ్చారన్నారు. విజయబాబు కుటుంబ సభ్యులను నల్గొండ నుంచి తీసకువచ్చి ఇక్కడ ఉద్యోగం ఇచ్చినట్టు ఆరోపించారు. అక్రమంగా తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను వెంట నే విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఉద్యోగాల పేరుమీద అక్ర మాలకు పాల్పడుతున్న సానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ్ బాబ ను ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేనియెడల విధులు బహిష్కరిస్తామని సంగారెడ్డి మున్సిపల్ కార్మికులు హెచ్చరించారు. కాగా సదరు సానిటరీ ఇన్‌స్పెక్టర్ చర్యలు తీసుకుంటామని అడిషనల్ డైరెక్టర్ హామీ ఇచ్చినట్టు యాదగిరి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మనీ, పద్మమ్మ, నరసమ్మ, రేఖ, రాజు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలపై దాడులు హేయనీయం



నవతెలంగాణ-జహీరాబాద్

దేశంలో ముస్లిం మైనార్టీలపై జరుగుతున్న దాడులు హేయనీయమని వివిధ సంఘాల నాయకులు అన్నారు. కిస్టియన్, ముస్లిం మైనారిటీ, దళితుల, బహుజనుల రౌండ్ టేబుల్ సమావేశాన్ని జహీరాబాద్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి పాస్టర్లు, ముల్లాలు, సామాజిక నాయకులు, పొలిటికల్ పార్టీ నాయకులు హాజరయ్యారు. క్రైస్తవుల మీద, చర్చీల మీద, మసీద్ల మీద, ముస్లీంల పైన, దళితుల పైన నేడు దేశవ్యాప్తంగా జరుగుతున్న దాడులకు గల కారణాలు, వాటిపై తీసుకోవాల్సిన జాగ్రత్తల పై చర్చించారు. భవిష్యత్తులో ముస్లిం, క్రైస్తవులు ఐక్యతతో ఓటు బ్యాంకుగా మారి మతోన్మాదాన్ని ఎదుర్కోవాలని నిర్ణయించారు. త్వరలో క్రిస్టియన్, ముస్లీం, మైనార్టీలతో కలసి ఒక కమిటిగా ఏర్పడి రాబోయే ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ ,బీసీ, మైనారిటీలను ఐక్య పరుస్తూ నియోజకవర్గంలోని ఓటు బ్యాంకును ఏకం చేసి మతోన్మాదాన్ని తరిమి కొడతామని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కుబాబు, మక్సూద్ దిన్షిప్ రాష్ట్ర సెక్రటరీ, ఎంఐఎం నియోజకవర్గ ఇన్చార్జి అత్ హర్ హైమాద్ , ఎంపీజె అధ్యక్షులు అయ్యూబ్ అహమ్మద్ , మైనార్టీ యాక్షన్ కమిటీ కార్యదర్శి మోయిద్ హమ్మద్, పాస్టర్. రమేష్ బాబు ప్రెసిడెంట్, పాస్టర్. పాల్ రాజ్, ఎండి షహబాద్, మహమ్మద్ హమ్మద్ అలీ, డా. పెద్దగోళ్ల నారాయణ సామాజిక నాయకులు, మహమ్మద్ షరీఫ్ ఎండి. మజీద్ లు, సినియర్ జర్నలిస్ట్ ఎజ్జాస్, మహబూబ్ అలీ, రాయికోటి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

నవతెలంగాణ-జహీరాబాద్



విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచ్చుకుంటే.. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఆర్ఎల్ఆర్ విద్యాసంస్థల చైర్మెన్ డాక్టర్ ఆర్.లక్ష్మారెడ్డి అన్నారు. పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన అకాడమిక్ సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించి.. ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల పరికరాలను పరిశీలించి అభినందించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తమ విద్యాసంస్థలలో ఒకటో తరగతి నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని అలవాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. నేడు విద్యార్థులు టెక్నాలజీని వినియోగించుకొని వివిధ రకాల చెడు వ్యసనాలకు గురవుతున్నారని.. అలా కాకూడదనే లక్ష్యంతోనే విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేస్తున్నట్టు చెప్పారు. తమ పాఠశాల ఆధ్వర్యంలో ప్రతీయేడు నిర్వహించే కార్యక్రమాలకు విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా చేస్తున్న కృషి ఎంతో అభినందనీ యమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కవితారెడ్డి, సిబ్బంది, విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వరి పంటలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి

నవతెలంగాణ-జోగిపేట



వరి పంట సాగులో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జోగిపేట ఏడిఏ అరుణ సూచించారు. అందోల్ మండలం కన్సన్‌పల్లి గ్రామంలో మంగళవారం వివిధ పంటలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుతం వరి పంటలో కాండం తొలుచు పురుగు ఉధృతి అధికంగా ఉన్నదని.. దానిని అరికట్టడానికి క్లోరాంత్రినిలిప్రోల్ 60 మిల్లీలీటర్ ఒక ఎకరానికి పిచికారి చేసుకోవాలని సూచించారు. దాంతో దాని ఉధృతి తగ్గుతుందన్నారు. మక్క పంటను నష్ట పరిచే కత్తెర పురుగు నివారణకు ఇమామిక్టిన్ బెంజోయిట్ 80 గ్రాములు ఒక ఎకరానికి వాడుకొని పురుగు ఉధృతిని తగ్గించుకోవచ్చు అన్నారు. రైతులు నష్ట నివారణ చర్యలు తక్షణమే చేపట్టి అధిక దిగుబాడులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రీకర్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

చల్మేడలో సబ్ స్టేషన్ స్థల పరిశీలన



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని చల్మేడ గ్రామంలో సబ్ స్టేషన్ ఏర్పాటు కోసం విద్యుత్ అధికారులు మంగళవారం స్థల పరిశీలన చేపట్టారు. చల్మేడలో తీవ్ర విద్యుత్ అంతరాయలు ఏర్పడుతున్నాయని గ్రామంలో ఒక సబ్ స్టేషన్ ఏర్పాటుకు కావాల్సిన స్థలం కేటాయించాలని గతంలో మాజీ సర్పంచ్ నరసింహరెడ్డి జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ 33/11కెవి సబ్‌స్టేషన్‌కు మంజూరు చేసిన స్థలం అనువుగా లేదని విద్యుత్ అధికారులు నిరాకరించారు. ఈ నేపథ్యంలో మరొక స్థలంలో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించగా మంగళవారం సదరు స్థలాన్ని విద్యుత్ అధికారులు పరిశీలించారు. ఆస్థలం అనువుగా ఉన్నదని చెప్పినట్టు మాజీ సర్పంచ్ నరసింహ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ సుధాకర్, కన్‌స్ట్రక్షన్ ఏఈ నారాయణ, సివిల్ ఏఈ గణేష్,లైన్ మెన్ బాలయ్య, కాంట్రాక్టర్ స్వామి, గ్రామస్థులు బొమ్మని స్వామి తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుడికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-కౌడిపల్లి

మండలంలోని బూరుగడ్డ గ్రామానికి చెందిన మల్లేశం అనే వికలాంగుడు తనకొచ్చే పెన్షన్‌తో కుటుంబాన్ని పోషించలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఇదే విషయాన్ని కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు చిలుముల సుహాసిని రెడ్డి తీసుకెళ్లగా.. ఆమె వెంటనే స్పందించి ఆర్థిక సాయం అందజేశారు. నూతనంగా ఓ కిరాణా దుకాణాన్ని పెట్టుకుని ఆనందంగా గడపాలని ఆ వికలాంగుడికి సుహాసిని రెడ్డి సూచించారు. అంతేకాకుండా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్కీములు వచ్చిన వికలాంగులకు అందజేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు.



డీటీసీపీ అనుమతులు లేకుండానే ప్లాట్ల అమ్మకాలు

నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలో ఎక్కడ చూసినా అక్రమ వెంచర్లు పుట్టగొడుగుల పుట్టుకొస్తున్నాయి. కొందరు ప్రభుత్వం నుంచి కావాల్సిన అనుమతుల పత్రాలు లేకుండానే ప్లాట్లుగా చేసి విక్రయా లకు పాల్పడుతున్నారు.. ప్రభుత్వం నుంచి డీటీసీపీ అనుమతులు తీసుకున్న తర్వాతనే ప్లాట్లు చేసి విక్రయించాలి.. కానీ దానికి విరుద్ధంగా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ ప్లాట్లను అమ్ముతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. డీటీసీపీ అనుమతులు అనగా కరెంటు పోల్స్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పార్కు, 40 ఫీట్ల రోడ్డు, వాటర్ ట్యాంకు, మొక్కలు నాటడం లాంటివి చేపట్టిన తర్వాతే ప్లాట్లను విక్రయించాలి. కానీ కొందరు నిర్వాహకులు ఇవేవీ పాటించకుండా ఇష్టారీతిన ప్లాట్ల వినియోగం చేపడుతున్నారని పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి.. వెంచర్ నిర్వాహకులపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై నిజాంపేట గ్రామ ప్రత్యేక అధికారి సురేష్ కుమార్‌ను వివరణ కోరగా డీటీసీపీ అనుమతి లేకుండా వెంచర్లు చేస్తే.. కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా రేణుక మాత విగ్రహ ప్రతిష్టాపన

- వేర్వేరుగా హాజరైన మాజీ ఎమ్మెల్యే

పద్మాదేవేందర్‌రెడ్డి, మైనంపల్లి హన్మంతరావు

నవతెలంగాణ-హవేలీఘనపూర్

మండల పరిధిలోని బూరుగుపల్లిలో శ్రీ రేణుకా మాత ఆలయ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. బూరుగుపల్లి గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో పద్మాదేవేందర్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్య రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచులు యామిరెడ్డి, సరిత సాయాగౌడ్, మండల పార్టీ నాయకులు సాప సాయిలు, మేకల సాయిలు, బాలరాజ్, గౌడ సంఘం నాయకులు రామస్వామి గౌడ్, వెంకా గౌడ్, శ్రీనివాస్ గౌడ్, సిద్ధగిరి గౌడ్, స్వామి గౌడ్, సురేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మైనంపల్లి హనుమంతరావు ప్రత్యేక పూజలు..

బూరుగుపల్లి రేణుక మాత విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కూడా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుమ్మరి రాజు కుటుంబాన్ని, సాయగౌడ్ కుమారుడు మరణించడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న అల్లి భూపాల్‌ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బూరుగుపల్లి ఎంపీటీసీ అర్చన శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచ్ సుభాష్ కాంగ్రెస్ పార్టీ మహిళా ఉపాధ్యక్షులు మంజుల సిద్ధగిరి గౌడ్, నాయకులు బాలకిషన్ రావు, మహేందర్ రెడ్డి, హఫీస్ ఉద్దీన్, పవన్, పరశురాం గౌడ్, అశోక్ పంతులు, రామచంద్ర రావు, శ్రీనివాస్ గౌడ్, సురేష్ గౌడ్ వెంకట్ రాములు, డాక్టర్ రాములు,లెంక రాజు, సాయిబాబా, ఎంఎస్ఎస్ఓ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.







దగ్గరుండి బోరు మోటార్‌కు మరమ్మతులు చేయించిన తహసీల్దార్

నవతెలంగాణ-నార్సింగి

మండల పరిధిలోని పెద్దతాండా, జేమ్లా తాండాను మండల తహసీల్దార్, గ్రామ ప్రత్యేక అధికారి షేక్ కరీం మంగళవారం సందర్శించారు. అయితే గ్రామ పంచాయతీకి సంబంధించిన బోరు మోటార్ కాలి పోయిందని తెల్సుకుని.. దగ్గరుండి మోటార్‌ను తీయించి మరమ్మతులకు పంపించారు. మరమ్మత్తు త్వరితగతిన అయ్యేలా చూడాలని పెద్దతాండా పంచాయితీ కార్యదర్శి బాలుకు సూచించారు. బోరు మోటార్ మరమ్మత్తు అయ్యేవ రకు ట్యాంకర్ల ద్వారా నార్సింగి నుంచి నీటిని తెప్పించి హరితహారం చెట్లు, నర్సరీకు అందిస్తామన్నారు. అనంతరం జేమా తాండా వాసులను నీటి వసతుల గురించి వాకబు చేశారు. నీటి సరఫరాలో కొన్ని సమస్యలు ఉన్నాయని తాం డా ప్రజలు తహసీల్దార్‌కు తెలుపగా, నీటి సమస్యను పరి ష్కరిసానన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ ఈ స్వప్న, కార్యదర్శి బాలు తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం సేకరణలో ఉద్యోగుల సేవలు అభినందనీయం

టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్

జిల్లా సహకార శాఖ ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ

నవతెలంగాణ-మెదక్

రైతులు పండించిన ధాన్యాన్ని సేకరించడంలో జిల్లా సహకార శాఖ ఉద్యోగుల సేవలు అభినందనీయమని టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ అన్నారు. టీఎన్జీవో భవన్‌లో మంగళవారం నిర్వహించిన జిల్లా సర్వసభ్య సమావేశంలో సహకార శాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆరేళ్ల రామాగౌడ్ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్ గౌడ్, జిల్లా సహకార శాఖ అధికారి కరుణతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ధాన్యం సేకరణతో పాటు ప్రాథమిక వ్యవసాయ పరపతి, మత్స్య కార్మికులు, గొర్రెల పెంపకం దారులు, పాల ఉత్పత్తి దారులు, గీత పారిశ్రామిక సహకార సంఘాల ఎన్నికల వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు సేవలందించినట్లు తెలిపారు. విధి నిర్వహణలో అంకితభావంతో పని చేస్తూ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం టిఎన్జీవో సంఘం నిర్వహించే కార్యకలాపాలలో ప్రధాన భాగస్వామ్యం కావా లన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మినికే రాజ్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గాండ్ల అనురాధ, మాజీ అధ్యక్షులు శ్యామ్ రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా సహకార ఆడిట్ అధికారి కరుణాకర్, సహకార శాఖ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి సంగమేశ్వర్, రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్, సహకార ఉద్యోగులు యాకూబ్ అలి, భరత్ కృష్ణ, పూర్ణచందర్, రాజేష్, తుకారం తదితరులు పాల్గొన్నారు.



నూతన ఎస్ఐని కలిసిన మాజీ ఉపసర్పంచ్

నవతెలంగాణ-కౌడిపల్లి

ఇటీవలే సిద్దిపేట నుంచి కౌడిపల్లి మండలానికి నూతనంగా వచ్చిన ఎస్ఐ రంజిత్ రెడ్డిని మాజీ ఉపసర్పంచ్ చంద్రం శ్రీనివాస్ గౌడ్, దుర్గ భవాని దాబా యజమాని నెల్లూరు సుధాకర్‌గౌడ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్ఐని శాలువాతో సన్మానించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ.. శాంతి భద్రతలు కాపాడటానికి రాజకీయ నాయకులు, యూత్, గ్రామ ప్రజలు అందరూ సహకరించాలన్నారు.

ప్రాణం ఉన్నంతం వరకు ప్రజా సేవ చేస్తాం

- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

నవతెలంగాణ-చిన్నశంకరంపేట

తమ కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు ప్రజాసేవ చేస్తామని మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. మండలంలోని వెంకట్రావుపల్లి, చెన్నైపల్లి గ్రామాల్లో తండ్రి లేని అనాథ పిల్లలకు కుటుంబంలో ఒక్కరికి రూ.25వేల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి.. సదరు చెక్కులను మంగళవారం అందజేశారు. వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన పెద్దోళ్ల ఇందిర కుమారుడి పేరుమీద, కాసుల ఎల్లవ్వ కుమారుడు, బుడ్డ నోళ్ళ నవ్య కుమార్తె మరియు చెన్నాయిపల్లి గ్రామానికి చెందిన అంతం ఐలమ్మ కుమార్తె, గంట విజయ కుమార్తెలకు ఒక్కొక్కరి పేరుమీద రూ.25వేల చొప్పున మైనంపల్లి స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి.. చెక్కులను ఆయన చేతుల మీదుగా అందజేశారు. కాగా పాఠశాలలో మౌలిక సదుపాయాలు లేవని గ్రామానికి చెందిన మడూర్ మాజీ ఎంపీటీసీ నాగరాజు మైనంపల్లి దృష్టికి తీసుకురాగా.. వచ్చేయేడు పాఠశాలలు ప్రారంభమయ్యే ముందు తనసొంత డబ్బుతో ఫర్నిచర్ డెస్కులు, బెంచీలు అందజే స్తానన్నారు. నియోజక వర్గంలోని గుడులకు, బడులకు దాహార్తిని తీర్చేందుకు అనేక గ్రామాల్లో బోరుబావులు తవ్వించామని.. వాటికి త్వరలోనే బోరు మోటర్లు బిగిస్తామన్నారు. తెలంగాణ, ఆంధ్రా రెండు రాష్ట్రాలతో పోల్చుకుంటే మైనంపల్లి సోషల్ సర్వీసు ద్వారా తన సొంత డబ్బుతో మెదక్ నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినట్టు చెప్పారు. రాబోయే కాలంలో మెదక్ జిల్లాను అభివృద్ధి పథంలో ముందు వరుసలో ఉంచుతానని శపథం చేశారు. ఈ కార్యక్రమంలో శంకరంపేట తాజా మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, రామాయంపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగా నరేందర్, గోపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ అరుణ ప్రభాకర్, శ్రీమన్ రెడ్డి, మడూర్ మాజీ ఎంపీటీసీ నాగరాజు, మేడి గణేష్, సుధాకర్ మనోజ్‌కుమార్, సిద్ధిరాములు, చిరంజీవి, జీవన్ రమేష్‌గౌడ్, రామచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.



ఏ పార్టీతో బీజేపీ పొత్తు పెట్టుకోదు..

- పార్టీ రాష్ట్ర కార్యదర్శి, దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు
- విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని పిలుపు

నవతెలంగాణ-నర్సాపూర్

రానున్న పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలోని ఏ పార్టీతో బీజేపీ పొత్తు పెట్టుకోదని.. ఒంటరిగా బరిలో నిలుస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘు నందన్‌రావు అన్నారు. నర్సాపూర్ పట్టణంలో మంగళవారంఏర్పాటు చేసిన పార్టీ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లా డారు. తెలంగాణలోని 17 పార్లమెంటు స్థానాల్లో అధిక స్థానాలు బీజేపీ కైవసం చేసుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీ పొత్తు కుదుర్చు కుంటుందని కొన్ని మీడియా సంస్థలు, పత్రికలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని మండిపడ్డారు. వాటిని ప్రజలెవరూ నమ్మొద్దని వెల్లడించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్య ంలో బీజేపీ విజయ సంకల్ప యాత్రను నిర్వహిస్తున్నా మన్నారు. ఈ యాత్రలో భాగంగా రాజరాజేశ్వరి బస్సు యాత్ర ఈనెల 24న సాయంత్రం నర్సాపూర్‌కు చేరుకుం టుందని 25న నర్సాపూర్ పట్టణంలో భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. అనంతరం గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తుందన్నారు. ఈ యాత్రలో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు బసవ లక్ష్మీ నరసయ్య, ఆకుల రాజయ్య, గురువారెడ్డి, నందా రెడ్డి ,విజయ్ కుమార్, ధర్మ మురళీధర్ యాదవ్, గడ్డం శ్రీనివాస్, బచ్చేష్ యాదవ్, గోడ రాజేందర్, సంఘసాని సురేష్, యాదగిరి, రమణారావు, సతీష్ యాదవ్, ఆంజనేయులు గౌడ్, కొత్త శ్రీనివాస్ గుప్తా, కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.





కేజీబీవీలో ఘనంగా అన్యువల్ డే

నవతెలంగాణ-వెల్దుర్తి

మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో అన్యువల్ డే ప్రోగ్రాంను పాఠశాల స్పెషలాధికారి ఫాతిమా ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పీఏసీఎస్ డైరెక్టర్ రమేష్ చందర్, మాజీ ఎంపీటీసీ కిష్టయ్య, డీలర్ చంద్రయ్య హాజంయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. రానున్న పదో తరగతి పరీక్షలను దృష్టిలో పెట్టుకొని కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి మంచి ఫలితాలను తెచ్చుకోవాలన్నారు. అటు పాఠశాలకు ఇటు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. కాగా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు చేపట్టిన సాంస్కృత కార్యక్రమాలు, వినూత్న రీతిలో చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అంతకుముందు సరస్వతి దేవి చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేశారు. విద్యార్థులకు సాంస్కృతి కార్యక్రమాలను నిర్వహించేందుకు అవసరమైన ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ స్వాతితో పాటు ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు నీటమునిగి యువకుడు మృతి



నవతెలంగాణ-పాపన్నపేట

చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు మంజీరా నదిలో నీటమునిగి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని రామతీర్థం శివారులో గల మంజీర నది దగ్గర మంగళవారం జరిగింది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం... రాంతీర్థంకు చెందిన కట్ట ప్రభాకర్(25) హైదరాబాద్‌లో ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 15న పాపన్నపేట మండల పరిధిలోని నామాపూర్‌లో ఉంటున్న తన సోదరి ఇంటికి వెళ్తున్నానని చెప్పి వెళ్ళాడు. కాగా ఈనెల 19న సాయంత్రం చేపలు పట్టడానికి రామతీర్థం శివారులో గల మంజీర నది వద్దకు వెళ్ళాడు. చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తూ నీటమునిగి మృతి చెందాడు. స్థానికులు గమనించి మృతుని కుటుంబీకులకు సమాచారం అందించారు. కాగా అప్పటికే రాత్రి కావడంతో గాలింపు చర్యలు చేపట్టలేదు. మంగళవారం ఉదయం గజఈతగాళ్లతో నదిలో గాలించగా మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రభాకర్ మృతిపై అనుమానం ఉన్నదని అతడి భార్య సంతోషి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.



బస్సు, ట్రాక్టర్, ఆటో ఢీ..

తప్పిన పెను ప్రమాదం

స్వల్ప గాయాలతో బయటపడ్డ ఇద్దరు వ్యక్తులు

నవతెలంగాణ-వెల్దుర్తి

హైదరాబాదు నుంచి అతివేగంగా వస్తున్న బస్సు మాసాయిపేట మండలం బొమ్మరం గ్రామం నుంచి 44 జాతీయ రహదారి బొమ్మరం గేటు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ క్రమంలో అదే దారిలో వేగంగా వస్తున్న ఆటో ఆ రెండు వాహనాలను ఢీకొట్టంది. ఆ బస్సు, ట్రాక్టర్ మధ్య ఆటో ఇరుక్కుంటే ఘోరమైన ప్రమాదంగా మారేది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మాసాయిపేట గ్రామానికి చెందిన సాకలి బిక్షపతి, అదే గ్రామానికి చెందిన రమేష్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం తూప్రాన్ ఆసుపత్రి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న చేగుంట ఎస్సై హుటాహుటినా ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచే తంబురేశ్వర స్వామి ఉత్సవాలు

నవతెలంగాణ-టేక్మాల్

మెదక్ జిల్లా అందోల్ నియోజకవర్గంలోని టేక్మాల్ మండలం వేల్పుకొండ గ్రామంలో కాకతీయుల కాలంలో నిర్మించిన శ్రీ తుంబురీశ్వర స్వామి ఉత్సవాలు నేటి(21)నుంచి ఈనెల 25వ తేదీ వరకు అంగరంగ వైభవంగా జరగనున్నట్టు ఆలయ పూజారి వైద్య రవి కోటి రామశర్మ తెలిపారు. శ్రీ మదనానంద స్వామి వారి దివ్య ఆశీస్సులతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. శ్రీ తుంబురీశ్వర దేవాలయం కాకతీయుల కాలం నుంచే నిర్మితమైనదని ఇక్కడున్న శిలాశాసనాల ద్వారా తెలుస్తున్నది. ఆలయం చుట్టూ సంస్కృతిని కనువిందు చేస్తున్నట్టుగా శిల్ప స్తంభాలు.. ఓ వైపు లక్ష్మి, మరోవైపు మహంకాళి సరస్వతి దేవి అద్దం చూస్తూ అలంకరించుకున్నట్టు, ఇంకోవైపు పిల్లలకు పాలిస్తున్న తల్లి విగ్రహాలు అందంగా చెక్కబడి ఉన్నాయి. కాగా నేటి ఉదయం రుద్రా అభిషేకం, వ్యూహ వచనం, కలశ స్థాపన శకట ఉత్సవం, సాయంత్రం బండ్లు, బోనాలు నిర్వహిస్తారు. 22(గురువారం)న స్వామివారికి రుద్రాభిషేకం, పుష్పార్చన, శకట ఉత్సవం, పాటీ బండ్లు చేస్తారు. 23న బిల్వార్చన రుద్రాభిషేకం, పల్లకి సేవ నిర్వహిస్తారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి కుస్తీ పోటీలు నిర్వహించడం జరుగుతుంది. ఉదయం పార్వతి పరమేశ్వర రథోత్సవం జరుగుతుంది. 24న మాఘశుద్ధ పౌర్ణమి రోజున శివపార్వతులకు కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుంది. నిత్య అన్నదానం మరియు నిత్య భజన సంకీర్తనలు ఏర్పాటు చేస్తారు. ఈ కార్యక్రమాలకు శ్రీ శ్రీ శ్రీ మాధవానంద సరస్వతి స్వామి, శ్రీ శ్రీ పూ'పా' రాజయోగి వెంకటస్వామి, ఆత్మనంద ఆశ్రమం రుస్తుం పేట పీఠాధిపతులు విచ్చేయుచున్నారు.





ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీ పట్టివేత



నవతెలంగాణ- మద్దూరు

ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు మద్దూరు ఎస్సై షేక్ యూనుస్ అహ్మద్ అలీమంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సోమవారం రాత్రి మద్దూరు ఏఎస్ఐ జిల్లా జగదీష్, సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా నర్సాయపల్లి, గాగిల్లాపూర్, గ్రామాల మధ్య రాంపూర్, క్రాస్ రోడ్ వద్ద ఇసుక లారీని పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. అక్కన్నపేట, మండలం గుడాటపల్లి, గ్రామానికి చెందిన అజ్మీర మోహన్, కు చెందిన లారీలో ఇసుక తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రజలు సహకరించాలి

- ఎస్సై పరశురాం



నవతెలంగాణ-మిరుదొడ్డి

గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ప్రజలు సహకరించాలని ఎస్సై పరశురాం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో రుద్రారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు నూతనంగా వచ్చిన ఎస్సై పరశురాముకు శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రుద్రారం గ్రామానికి చెందిన టిఆర్ఎస్ నాయకులు సురేష్ వెంకట్ కనకయ్య లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ

నవతెలంగాణ- రాయపోల్

పదవ తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయుల సహకారంతో స్నాక్స్ పంపిణీ చేస్తున్నట్టు రాయపోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్ రెడ్డి తెలిపారు. మంగళవారం రాయపోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్నాక్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చ్ 18 నుండి 10వ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడం కోసం వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శేషాచారి, తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.



మురుగు కాల్వ పనులను త్వరలో ప్రారంభిస్తాం

నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ఐదో వార్డులో పరిధిలోని సంగాపూర్‌లో మురుగు కాల్వ సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని మున్సిపల్ చైర్మెన్‌నేతి చిన్న రాజమౌళి అన్నారు. మంగళవారం స్థానిక కౌన్సిలర్ శ్యామల మల్లేశం యాదవ్ తో కలిసి మురుగు కాలువ నిర్మాణ స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంటనే నిర్మాణం చేపడతామన్నారు. ఆయన వెంట కౌన్సిల్ సభ్యులు శ్యామల మల్లేశం యాదవ్, భాగ్యలక్ష్మి దుర్గ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఇంట్లో చోరీ

నవతెలంగాణ-చేర్యాల

ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన మంగళవారం మండలంలోని ముస్త్యాల గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి సామల రామస్వామి ఈనెల 16న కుటుంబ సమేతంగా షిరిడి దేవస్థానంకు వెళ్లారు. మరుసటి రోజు సాయంత్రం రామస్వామి ఇంటి పక్కన ఉన్న తాటిపాముల ప్రవంతి గమనించి మీ ఇంటితోపాటు షటరు తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లో దొంగలు పడ్డారని ఫోన్ ద్వారా తెలుపగా అదే గ్రామంలో ఉంటున్న రామస్వామి అన్న కుమారుడికి విషయం తెలపడంతో ఇంట్లోకి వెళ్లి గమనించాడు. షిరిడి నుండి కుటుంబ సభ్యులతో తిరిగివచ్చి మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మొత్తం సొమ్ము రూ. 24 వేల విలువ ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

స్వపరిపాలనా దినోత్సవం

నవతెలంగాణ- జగదేవపూర్



మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వపరిపాలనా దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు.డీఈవో గా వైభవ్, ప్రధానోపాధ్యాయురాలుగా అఖిల, ఎంఈఓ గా వెంకటేష్ ఉపాధ్యాయులుగా ,దివ్య , మానస, సంజన , ధనలక్ష్మి, అఖిల , ప్రసన్న ఆనంద్ ,భాను ప్రకాష్ , భాను ,నితిన్ , సాయివర్ధన్,స్పందన, అటెండర్ గా విష్ణువర్ధన్ లు వ్యవహరించారు. బోధనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు నరేందర్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్రాంరెడ్డి, అశోక్, విజయలక్ష్మి కవిత, పుష్పలత, రఘురాములు , విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ- హుస్నాబాద్ రూరల్

మండలంలోని గాంధీనగర్ గ్రామంలో ఉపాధి హామీ నిధులు రూ .10 లక్షలా 85 వేలతో సీసీ రోడ్డు పనులను మంగళవారం స్పెషల్ ఆఫీసర్ నాగరాజు ప్రారంభించారు. గ్రామ అభివృద్ధి కోసం ఉపాధి హామీ పథకంలో మంజూరైన సీసీ రోడ్డు పనులను త్వరగా పూర్తి అయ్యేలా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హారిక, మాజీ సర్పంచ్ బొంగోని శ్రీనివాస్ గ్రామస్తులు పాల్గొన్నారు.



క్రమశిక్షణతో కూడిన జీవనం ప్రాముఖ్యం

నవతెలంగాణ-బెజ్జంకి

క్రమశిక్షణతో కూడిన జీవనం సమాజంలో ప్రాముఖ్యమైందని.. తల్లిదండ్రులు వారి పిల్లలను క్రమశిక్షణతో పెంచాలని బాలవికాస స్వచ్ఛంద సేవ సంస్థ ప్రతినిధి లత తెలిపారు.మంగళవారం మండల పరిధిలోని బెజ్జంకి క్రాసింగ్ గ్రామంలోని కృపా భవన్ యందు బాలవికాస అధ్వర్యంలో అనాథ పిల్లల జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చిన్నారులతో కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు.బాలవికాస స్వచ్ఛంద సేవ సంస్థ కుల,మత,రాజకీయాలకు అతీతంగా వివిధ రుపాల్లో సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపడుతుందని బాలవికాస ప్రతినిధి లత తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ టేకు తిరుపతి,కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి,అయా గ్రామాల బాలవికాస ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వీయ అనుభం ద్వారా నైపుణ్యం

నవతెలంగాణ-రాయపోల్

విద్యార్థులు స్వీయ అనుభవం ద్వారా ఎంతో నైపుణ్యతను సాధిస్తారని వడ్డేపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణు అన్నారు. మంగళవారం మండలంలోని వడ్డేపల్లి ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాల దినోత్సవం నిర్వహించారు. డీఈవో వరుణ్ సందేశ్, ఎంఈఓగా వర్షిని,కాంప్లెక్స్ ప్రధానో పాధ్యాయులుగా హర్షవర్ధన్, ప్రధానోపాధ్యాయులుగా ప్రణయ్‌శ్రీ విధులు నిర్వర్తించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అంజిరెడ్డి, ఉపాధ్యాయులు నవీన్ కుమార్, నరేందర్, చంద్రయ్య, సుధాకర్, సుధాకర్ రెడ్డి, వరప్రసాద్, శ్రీనువాస్, మధు, విద్యాసాగర్, స్వామి, యాదగిరి, జీనత్, ప్రియాంక చోప్రా, సిఆర్పి యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి ఫలితాల్లో జిల్లాను మొదటి స్థానంలో నిలపాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ రోజా శర్మ

నవతెలంగాణ - సిద్దిపేట

పదవ తరగతి ఫలితాల్లో జిల్లాను మొదటి స్థానంలో నిలపాలని జెడ్పీచైరెపర్సన్ రోజా శర్మ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణశర్మ అధ్యక్షతన వ్యవసాయం, గ్రామీణ, విద్యా వైద్య స్థాయి సంఘ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాసంగి పంటలకు ఎరువుల కొరత రాకుండా పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా చూసుకోవాలని సంబంధిత వ్యవసాయ అధికారిని ఆదేశించారు. రైతుబంధు పెట్టుబడి సాయం ఇప్పటివరకు జిల్లాలో ఎంతమందికి వచ్చిందని, ఎన్ని ఎకరాల వరకు వేయడం జరిగిందని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల చెల్లింపులు పూర్తిస్థాయిలో చెల్లించినందుకు వారిని అభినందించారు. చిన్నకోడూరు మండలంలో ఐనా దాడికి 18 దూడలు మరణించగా వాటి ఇన్సూరెన్స్ భీమా చెల్లింపులు వెనువెంటనే పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించి ఎంతో కీలకమైనటువంటి మేడారం సమ్మక్క సారక్క జాతర



ఉత్సవాలలో ప్లాస్టిక్ రహితంగా చేసుకునే విధంగా శ్రద్ధ చూపాలని , ప్లాస్టిక్ వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని అన్నారు. ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించే విధంగా జాతరకు వచ్చేటువంటి భక్తులను ప్రోత్సహించాలని ఆమె సంబంధిత పోస్టర్ ను ఆవిష్కరించారు. పశువులకు వైద్య పరీక్షల నిర్వహణ కోసం ట్రేవీస్ లను అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేయాలని తీర్మానించారు. రైతులకు డ్రిప్ లు అందించే విధంగా చొర తీసుకోవాలని, ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ పనులు పూర్తిచేసి ప్రజలకు వినియోగం లోకి త్వరితగతిన తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పౌరసరఫరా శాఖలో ఖాళీగా ఉన్న 15 చౌక ధరల దుకాణాలు, కొత్తగా కేటాయించిన మూడు దుకాణాలకు అర్హత కలిగిన అభ్యర్థులను గుర్తించి డీలర్ షిప్ కేటాయించాలని సూచించారు.ఉపాధి హామీ పథకంలో ఏప్రిల్ ఒకటి నుండి వంద రోజుల పనులు ప్రారంభించాలన్నారు. మార్చి ఒకటి నుండి పదవ తరగతి ప్రీ ఫైనల్ ఎగ్జామ్స్ ఉండగా మార్చి 18 నుంచి ఫైనల్ ఎగ్జామ్స్ దృష్టిలో పెట్టుకొని సిద్దిపేట జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో వచ్చే విధంగా కృషి చేయాలని, విద్యార్థులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తూ చొరవ తీసుకోవాలని విద్యాధికారికి సూచించారు. జిల్లాలో త్వరలో ప్రారంభించే గ్రంథాలయాలను ప్రజాప్రతినిధులు, అధికారులు అందరి భాగస్వామ్యంతో త్వరితగతిన ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, జెడ్పి సీఈవో, జెడ్పిటిసిలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రైతులకు 24 గంటల త్రీఫేస్ కరెంట్ ఇవ్వాలి

- ఎంపీపీ పుష్పలత కిషన్ రెడ్డి

నవతెలంగాణ- దుబ్బాక

గత కేసీఆర్ ప్రభుత్వం హయాంలో ఇచ్చిన విధంగా రైతులకు 24 గంటలు త్రీ ఫేస్ కరెంట్ ఇవ్వాలని ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కారు రైతులను ఇబ్బందులకు గురిచేసే విధంగా సాయంత్రం 5:30 నుండి 11:30 వరకు సింగిల్ ఫేస్ కరెంటు ఇవ్వడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని మండిపడ్డారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది .పెద్దచీకోడు ఎంపీటీసీ లచ్చమ్మగారి రామిరెడ్డి,పోతారెడ్డిపేట ఎంపీటీసీ చంద్రసాగర్ లు ఇరిగేషన్, రెవిన్యూ,ఎౖారెస్ట్, పీఏసీఎస్ అధికారుల పనితీరుపై తీవ్రంగా మండిపడ్డారు.ఎంపీపీ పుష్పలత కిషన్ రెడ్డి మాట్లాడుతూ స్పెషల్ ఆఫీసర్లు ,అధికారులు సమన్వ యంతో పనిచేసి గ్రామాల్లో మంచినీటి సరఫరా, కరెంటు,వ్యవసాయ తదితర సమస్యలు తలెత్తకుండా ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వాటిని పరిష్క రించాలన్నారు.ఈ సర్వసభ్య సమావేశంలో తహసీల్దార్లు నల్ల వెంకట్ రెడ్డి, జయంత్, ఇంచార్జ్ ఎంపీడీవో సూపర్ రెండెంట్ శ్యామల దేవి ఎంపిఓ నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎంపీడీవో భాస్కర శర్మకు ఘన వీడ్కోలు

ఎంపీడీవో వేలేటి భాస్కర శర్మకు మండల సర్వసభ్యులు మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. నాలుగేళ్లుగా దుబ్బాక అధికారులు,ప్రజాప్రతినిధులు,దిగువ స్థాయి సిబ్బంది అందరితోనూ ఎంపీడీవో



భాస్కర శర్మ ఆత్మీయంగా కలిసి పనిచేశాడని ,వారందరినీ సమన్వయం చేస్తూ మండల అభివృద్ధిలో తనదైన ముద్ర వేశాడని ఎంపీపీ కొత్త లత పుష్పలత కిషన్ రెడ్డి,జెడ్పీటీసీ కడతాల రవీందర్ రెడ్డి, ఎంపీటీసీలు ఎం.చంద్రసాగర్, ఎల్.రాంరెడ్డి కొనియాడారు.అనంతరం భాస్కర శర్మను శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ నరేందర్ రెడ్డి,సూపరిండెంట్ శ్యామల దేవి, ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ,పీఆర్ ఏఈ రిజ్వాన్, ఐకెపి ఏపీఎం దాకయ్య మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.



భక్తులు పోలీసుల సూచనలు పాటించాలి

- జాతర ఏర్పాట్లు పరిశీలించిన ఏసీపీ సతీష్

నవతెలంగాణ -హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ డివిజన్ పరిధిలో జరిగే సమ్మక్క సారక్క జాతరకు వచ్చే భక్తులు, ప్రజలు పోలీసుల సలహాలు సూచనలు పాటించి ప్రశాంతమైన వాతావరణంలో సమ్మక్క సారక్క లను దర్శించుకుని వెళ్లాలని ఏసీపీ సతీష్ సూచించారు. మంగళవారం పట్టణ శివారు తో పాటు డివిజన్ లో జరిగే సమ్మక్క సారక్క జాతర ప్రదేశాలను ఏసీపీ, సీఐ ఎర్రల్ల కిరణ్, అక్కన్నపేట ఎస్ఐ వివేక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు చూపించిన ప్రదేశంలో వాహనాలు పార్కింగ్ చేసుకోవాలన్నారు.రోడ్డుకు అడ్డదిడ్డంగా వాహనాలు పార్కు చేయవద్దని తెలిపారు . ప్రజలకు ఇతర భక్తులకు ఇబ్బంది కలిగించవద్దని సూచించారు. జాతర జరుగు ప్రదేశాలలో బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో జాతర నిర్వహించే నిర్వాహకులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

- సీఐ పీ.శ్రీనివాస్

నవతెలంగాణ -దుబ్బాక



ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ పీ.శ్రీనివాస్ హెచ్చరించారు. విద్యార్థులు అపరిచిత వ్యక్తులను నమ్మవద్దని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంగళవారం మండల పరిధిలోని తిమ్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిద్దిపేట షీ టీమ్ బృందం, సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, ర్యాగింగ్,ఈవ్ టీజింగ్,మానవ అక్రమ రవాణా నిర్మూలన,గుడ్ టచ్,బ్యాడ్ టచ్ వంటి వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెంటయ్య, అధ్యాపక బృందం, సిద్దిపేట షీ టీం సిబ్బంది ఏఎస్ఐ కిషన్ పవార్,మహిళా కానిస్టేబుళ్ల మమత,వీణ కుమారి,కానిస్టేబుల్లు ప్రవీణ్,లక్ష్మీనారాయణ పలువురు పాల్గొన్నారు.

యూనివర్సిటీ విత్తనాలు నాణ్యమైనవి

- ప్రైవేట్ కంపెనీల సీడ్ నమ్మి రైతులు మోసపోవద్దు
- వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు డాక్టర్, పి. రఘురామిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్

నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

యూనివర్సిటీలో ఇచ్చినవి నాణ్యమైన విత్తనాలు అని వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు , జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ అన్నారు . మంగళవారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త అధిపతి డాక్టర్, ఎస్. శ్రీదేవి ఆధ్వర్యంలో రైతులకు ప్రొద్దు తిరుగుడు సాగుపై అవగాహన కల్పించారు. ముందుగా బుస్సాపూర్ తోర్నాల పొద్దుతిరుగు పంటలను శాస్త్రవేత్తతో కలిసి పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో దాదాపు 8700 ఎకరాల విస్తీర్ణం లో సాగు చేస్తున్నారని అన్నారు. పంటలో కలుపు నివారించకపోతే పంట దిగుబడి 50 శాతం తగ్గుతుందని రైతులు కచ్చితంగా కలుపు నివారణ చేపట్టాలని అన్నారు. పొద్దు తిరుగుడు లో వయ్యారిభామ ఎక్కువగా ఉండడంవల్ల పంటకు తెగుళ్ల సోకి పంట నాశనం అవుతుందని



దానివల్ల పంట ఎదగడం ఆగిపోయి దిగుబడికి కారణం అవుతుందని సూచించారు . రైతులు పంట వేసేటప్పుడు బయట ప్రైవేట్ కంపెనీలో సీడ్ వాడకుండా యూనివర్సిటీలో తయారైన విత్తనాలు ఎంచుకోవాలని అన్నారు. పంటకు సంబంధించి సమస్యలు ఉంటే శాస్త్రవేత్తల సలహాలు సూచనలు తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఉమారాణి, శ్వేత, సరిత, శ్రీజయ,ప్రధాన శాస్త్రవేత్త రమాదేవి, ఏఈఓ ప్రేమ్ సాయి బుస్సాపూర్ మాజీ సర్పంచ్ సదాశివ రెడ్డి రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ జీవితంలో ఒక భాగం మాత్రమే

నవతెలంగాణ-చేర్యాల

ఉద్యోగ విరమణ జీవితంలో ఒక భాగం మాత్రమేనని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి. సర్వేశ్వర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ ల్యాబ్ అటెండర్ గా విధులు నిర్వహించిన బీర్కూరి మనోహర్ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని మంగళవార ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మనోహర్ కళాశాలలో గత 32 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారని, కళాశాలలోని అధ్యాపకులు, విద్యార్థులతో మంచి అనుబంధాన్ని పెంచుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఆడెపు నరేందర్,అధ్యాపకులు అనందాసు, వెంకటేశ్వర్లు, డి. మధు, బి.విద్యాసాగర్, కే. శ్రీధర్, ఎల్. పరశురాములు, జి.రవి, ఏ. సమ్మయ్య, పద్మలత, ఎస్. శ్యాంసుందర్, కవిత, స్వప్న బి. చంద్రమోహన్, బి. అనూష, రేవతి, ఉపాధ్యాయులు పెండం శ్రీకాంత్, పెండెం ఉమారాణి, బీరుకూరి శివకుమార్, కార్యాలయ సిబ్బంది బి. స్వప్న, భవాని ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.



సిద్దిపేట జిల్లాకు మూడు అలయన్స్ అవార్డులు

నవతెలంగాణ - సిద్దిపేట

అలయన్స్ దక్షిణ భారతదేశ కన్వెన్షన్‌లో 5 రాష్ట్రాలకు సంబంధించిన సమీక్ష సమావేశాలు ఈ నెల 17, 18న హైదరాబాదులో నిర్వహించగా సిద్దిపేట జిల్లాకు మూడు అవార్డులు వచ్చాయి. తనకు బెస్ట్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్‌గా అవార్డు వచ్చినట్లు ఆత్మ రాములు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లా బెస్ట్ వైస్ గవర్నర్‌గా సోమ వనజ, సౌత్ మల్టిపుల్ అదనపు పిఆర్ఓగా అంజయ్యకు సౌత్ మల్టిపుల్ చైర్మన్ బొజ్జ మధుసూదన్ చేతుల మీదుగా అవార్డులు అనుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సౌత్ మల్టిపుల్ చైర్మన్ వెంకట్రావు, ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్లు, ఫాస్ట్ ప్రెసిడెంట్ లు, ఐదు రాష్ట్రాలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.



నమస్తే స్కీం పై కార్మికులకు అవగాహన

నవతెలంగాణ- హుస్నాబాద్‌రూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన నమస్తే స్కీం పై మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోచైర్మెన్ ఆకుల రజిత కార్మికులకు నమస్తే స్కీంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెప్టిక్ ట్యాంక్ వర్కర్లందరూ పురపాలక సంఘం తరఫున లైసెన్స్ తీసుకోవాలని, పీపీఈ కిట్ తప్పకుండా ధరించాలని సూచించారు. నమస్తే స్కీమ్ ద్వారా హెల్త్ ఇన్సూరెన్స్ , రుణాలు కానీ, సబ్సిడీ కింద కొత్త వాహనాలు కొనుగోలు చేయడానికి మీకు ఒక సువర్ణ అవకాశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ అయిలేని అనిత రెడ్డి, కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్ గోవిందు రవి, సానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం , ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ రవికుమార్, జవాన్లు సారయ్య ,ప్రభాకర్ మరియు సెప్టిక్ ట్యాంక్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

మట్టి టిప్పర్లు పట్టివేత

నవతెలంగాణ- కొండపాక

మండలంలో పలు గ్రామాల్లో అక్రమ మట్టి దందాపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మంగళవారం రెవెన్యూ అధికారులు అక్రమంగా తరలిస్తున్న మట్టి టిప్పర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్ లో అప్పగించారు. అక్రమంగా మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని ఆర్ఐ బాలకృష్ణ హెచ్చరించారు.

మహిళా రక్షణ చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

- సీఐ ఎర్రల్ల కిరణ్

నవతెలంగాణ -హుస్నాబాద్ రూరల్



మహిళలు, విద్యార్థులు మహిళా రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీఐ ఎర్రల్ల కిరణ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సివి రామన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులకు బాలికలకు, మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్ బాడ్ టచ్, తదితర అంశాల పై హుస్నాబాద్ సీఐ కిరణ్ అవగాహన కల్పించారు. ఎవరైనా వేధించిన రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేలనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే డయల్ 100,, సిద్దిపేట షిటీమ్ వాట్సప్ నెంబర్ 8712667434, మహిళా పోలీస్ స్టేషన్ సిద్దిపేట 8712667435 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొద్దుతిరుగుడు పంటను పరిశీలించిన వ్యవసాయ శాత్రవేత్తలు

నవతెలంగాణ-తొగుట



మండలంలోని గణపూర్ గ్రామంలో పొద్దుతిరుగుడు పంటలను మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు, డాక్టర్ పి. రఘురామ రెడ్డి, వ్యవసాయ పరిశోధన స్థానం తోర్నాల ప్రొఫెసర్, హెడ్ డాక్టర్. యస్. శ్రీదేవి, శాస్త్రవేత్త డాక్టర్ ఇ. ఉమారాని పొద్దుతిరుగు డు పంటలను పరిశీలించారు. పొదుతిరుగుడు పంట విస్తీర్ణం తగ్గడానికి గల కారణాలను రైతులను అడిగి తెలుసుకొని, పంట దిగుబడి పెరగడంలో విత్తన ఎంపిక, విత్తే పద్ధతి, విత్తే దూరం, ఎరువులు, నీటి యాజమన్యం, తాలు గింజలు ఏర్పడకుండా తీసు కోవాల్సిన జాగ్రత్తల గురించి సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవ సాయ అధికారులు మోహన్, వ్యవసాయ విస్తీర్ణ అధికారి దేవేందర్, గ్రామానికి చెందిన రైతు సోద రులు పుల్లగూర్ల యెల్ల రెడ్డి, గొట్టం యాదగిరి, పుల్ల గూర్ల నర్సింహా రెడ్డి పాల్గొన్నారు.

బెక్కల్ రామలింగేశ్వర స్వామి హుండీ లెక్కింపు

నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని బెక్కల్,రామలింగేశ్వర స్వామి హుండీని దేవాదాయ శాఖ అధికారులు.మంగళవారం లెక్కించారు. ఈ సందర్భంగా దేవదాయ శాఖ అధికారులు మాట్లాడుతూ..2023 మార్చ్ 2 నుండి ఈనెల 2024 వరకు ఆలయానికి వచ్చిన హుండీని లెక్కించినట్లు వారు తెలిపారు. 2 లక్షల ఒక వెయ్యి 367 ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. వచ్చిన ఆదాయాన్ని దూల్మిట్ట ఎస్బిఐ బ్యాంకులో రామలింగేశ్వర స్వామి ఖాతాలో జమ చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
బుధవారం | 21 ఫిబ్రవరి 2024 | www.navatelangana.com

వృత్తి లైసెన్స్‌ను వెంటనే తీసుకోవాలి

నవతెలంగాణ -గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 2023-2024 సంబంధించిన వృత్తి వ్యాపార లైసెన్సులు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 2023 లో వత్తి వ్యాపార లైసెన్స్ తీసుకోవాల్సి ఉండగా ఇప్పటి వరకు వ్యాపారాలు తీసుకోలేదన్నారు. లైసెన్సులు లేకుండా వ్యాపారం చేయడం 2019 చట్టం ప్రకారం చట్టరీత్య నేరమన్నారు. లైసెన్సు తప్పనిసరిగా తీసుకోవాలని మున్సిపల్ సిబ్బంది దుకాణ సముదాయం వద్దకు వచ్చినప్పుడు సహకరించి లైసెన్స్ తీసుకోవాలన్నారు. ఇంటి పన్నులు, నల్ల బిల్లులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు.

గజ్వేల్ పట్టణంలో కొనసాగుతున్న ఉత్సవాలు

నవతెలంగాణ -గజ్వేల్



గజ్వేల్ పట్టణంలో బీరప్ప, రేణుక ఎల్లమ్మ ఉత్సవాలు రెండు కొనసాగుతున్నాయి. మున్సిపల్ పరిధిలోని సంగుపల్లిలో బీరప్ప దేవాలయం ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా గజ్వేల్ పట్టణంలో గజ్వేల్ గౌడ సంఘం రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు కళ్యాణోత్సవములు నిర్వహిస్తున్నారు. సంగుపల్లి, గజ్వేల్ పట్టణంలో పండుగ వాతావరణం కనిపిస్తుంది. ఎక్కడ చూసినా పచ్చని తోరణాలు పచ్చని పందిళ్లతో గజ్వేల్, సంగుపల్లిలో ఉన్న యాదవులు, గౌడ్స్ ఇండ్ల ముందు దర్శనమిస్తున్నాయి.

సమ్మక్క, సారలమ్మ జాతరకు ముస్తాబైన అక్కెనపల్లి

- **నేటి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు**
- **సుమారు 40 సంవత్సరాలుగా కొనసాగుతున్న జాతర**

నవతెలంగాణ -నంగునూరు



ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి వచ్చే సమ్మక్క, సారలమ్మ జాతరకు నంగునూరు మండలంలోని అక్కెనపల్లి గ్రామం ముస్తాబైంది. మేడారంలో జరిగే జాతర మాదిరిగానే అదే ముహూర్తానికి గ్రామంలోనూ సమ్మక్క, సారలమ్మ జాతరను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. 40 ఏళ్లుగా గ్రామంలో జాతర నిర్వహిస్తున్నారు. మేడారం వరకు వెళ్లలేని భక్తులకు సౌకార్యర్థం ఇక్కడ మొక్కులు తీర్చుకునేలా సమ్మక్క, సారక్క గద్దెలను తీర్చిదిద్దారు. భక్తులు కోరుకున్న కోరికలు నెరవేరడంతో ఇక్కడి అమ్మవార్లను దర్శించుకునేందుకు మండలంలోని భక్తులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించి ఒడి బియ్యం పోసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. బుధవారం నుంచి 23 వరకు జరిగే ఈ ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. గ్రామంలో పండుగ వాతవరణం నెలకొంది. బుధవారం సారలమ్మను గద్దెకు తీసుకురావడం, గురువారం సమ్మక్కను గద్దెకు తీసుకువచ్చే కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించనున్నారు. జాతరలో భాగంగా శుక్రవారం భక్తులు ముడుపులు చెల్లించి మొక్కులను తీర్చుకోనున్నారు. శనివారం అమ్మవార్లు వన ప్రవేశం చేయనున్నారు. జాతర ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలియజేశారు.

జాతరకు బీజం పడింది ఇలా..

అక్కెనపల్లి గ్రామ శివారులో గల పులిగుండ్ల సమీపంలో 40 ఏళ్ల కింద ఓ గొర్రెల కాపరి మేకలను మేపుతుండుగా పెద్ద గుండు ప్రాంతంలో పసుపు, కుంకుమ ముద్దలు కనిపించాయి. ఈ విషయం కాస్త గ్రామస్థులకు తెలియగానే అక్కడికి గ్రామస్థులందరూ తండోప తండాలుగా తరలి వచ్చి పరిసరాలను పరిశీలించారు. మేడారంలో సమ్మక్క, సారక్క జాతర కొన్ని రోజుల ముందే ఈ ప్రాంతంలో పసుపు, కుంకుమ ముద్దలు, అమ్మవార్ల మహిమతోనే పసుపు, కుంకుమ కనిపించాయని, రెండేళ్లకోసారి గ్రామంలో జాతర జరిపించాలని పూనకం వచ్చిన ఓ మహిళ చెప్పింది. దీంతో ఆమె మాటల పై గ్రామస్థులకు నమ్మకం ఏర్పడింది. సమ్మక్క తల్లి పులి పైన స్వారీ చేస్తుందని అందుకే గ్రామంలోని పులిగుండ్ల వద్ద పసుపు రూపంగా దర్శన మిచ్చిందని గ్రామస్తులకు నమ్మకం కలిగింది. దీంతో గ్రామంలో ఆలయ నిర్మాణం చేపట్టాలని సంకల్పించారు. చందాలు వేసుకోని పులిగుండ్ల సమీపంలో 14 ఎకరాల స్థలాన్ని సేకరించి 1984లో సమ్మక్క, సారక్క గద్దెలు, మేన కోడలు లక్ష్మి, పగిడిద్దరాజు (నాగుపాము) ప్రతిమలను ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి మేడారంలో నిర్వహించే ముహూర్తానికి జాతరను నిర్వహిస్తున్నారు.



సైన్స్ టాలెంట్ టెస్టులో రాష్ట్రస్థాయికి విద్యార్థులు ఎంపిక

నవతెలంగాణ - సిద్దిపేట

టీటీసీ భవన్‌లో జిల్లా సైన్స్ అధికారి కల్లేపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జిల్లా సైన్సు టాలెంట్ టెస్ట్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జీవితంలో సైన్స్ ప్రాధాన్యత చాలా గొప్పదన్నారు. విద్యార్థులు సైన్స్ పట్ల శ్రద్ధ పెంచుకోవాలన్నారు. సైన్స్‌లో రాణిస్తే ఏ రంగంలోనైనా రాణిస్తారని తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి మాట్లాడుతూ మానవ జీవితాన్ని సైన్స్ చాలా ప్రభావితం చేస్తుందని, సైన్స్ పట్ల మంచి అవగాహన కలిగి ఉంటే జీవితం సుఖమయం అవుతుందని తెలిపారు. అనంతరం సైన్స్ టాలెంట్ టెస్టులో రాష్ట్రస్థాయికి ఎన్నికైన టీఎస్ఎంఎస్ ఇర్కోడు విద్యార్థి సూర్య తేజను, ద్వితీయ స్థానంలో నిలిచిన జడ్పీహెచ్ఎస్ పాములపర్తి విద్యార్థి నాగచైతన్య రెడ్డి, తతీయ స్థానంలో నిలిచిన ఎంజేపీ నారాయణరావుపేట విద్యార్థి శ్రీనివాస్ రెడ్డిని ప్రశంసా పత్రం, మేమంటోతో అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి పయ్యావుల రామస్వామి, భౌతిక శాస్త్ర ఫోరం కన్వీనర్లు సాదత్ అలీ, నరసింహారెడ్డి, భగవాన్, జీవశాస్త్ర ఫోరం కన్వీనర్లు నాగరాజు, అనిల్ కుమార్, భౌతిక శాస్త్ర, జీవశాస్త్ర ఉపాధ్యాయులు, రాజమౌళి, సురేందర్ రెడ్డి, చిన్న బ్రహ్మయ్య ,వెంకటనారాయణ, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టంతో చదవాలి

ఎర్రవల్లి పాఠశాలలో క్రిషి పామ్స్ అధినేత జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-మర్కుక్

విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టంతో చదివి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని క్రిషి పామ్స్ అధినేత చిట్నేని అమరసింహ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఎర్రవల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో క్రిషిఫామ్స్ అధినేత చిట్నేని అమరసింహ 36వ జన్మదిన వేడుకలను చిన్ననాటి స్నేహితులైన అర్బీఐ, హ్యూమన్ రైట్స్ అడ్వైజరీ మెంబర్ ధీరజ్ పుంతంకర్, అరవింద్ డిడ్డి, శివశంకర్ నారగోనితో విద్యార్థుల మధ్య నిరాడంబరంగా జరుపుకున్నారు. అనంతరం పాఠశాల అవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థుల మధ్య తమ జన్మదిన వేడుకలు నిర్వహించుకోడం సంతోషంగా ఉందన్నారు. ఎర్రవల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉన్నత విద్యా ప్రమాణాల కోసం మౌలికసదుపాయాల కల్పన కోసం విద్యా వాలంటీర్లకు వేతనాలు ఇస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ సమాజం కోసం ఎంతో కొంత సహాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ కమ్మరి బాలరాజు, ఎంపిటీసి ధనలక్ష్మీకష్ణ, నాయకులు సంగ నవీన్,సాయి చారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంధ్యరాణి, ఉపాధ్యాయులు తుమ్మ కుమార్, శ్రీశైలం, అన్నపూర్ణ, కవిత, శ్రావణి, విద్యార్థులు, తదితరులున్నారు.

డిగ్రీ విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ

నవ తెలంగాణ- దుబ్బాక

డిగ్రీ విద్యార్థులకు క్రికెట్ కిట్టు, బ్యాట్మెంటన్ రాకెట్స్ వంటి పలు క్రీడా సామాగ్రిని కళాశాల హిస్టరీ లెక్చరర్ నందిగామ వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. దుబ్బాక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరీ లెక్చరర్‌గా పనిచేస్తున్న నందిగామ వెంకటేశ్వర్లు సొంత డబ్బులు రూ.4వేలతో కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు క్రీడా సామాగ్రిని అందజేసినట్లు ప్రిన్సిపాల్ కే.భవాని తెలిపారు. ఈ సందర్భంగా లెక్చరర్ వెంకటేశ్వర్లను ప్రిన్సిపాల్ భవానీ అభినందించారు.

నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన

నవతెలంగాణ-బెజ్జంకి

పాపన్నపల్లిలో గ్రామంలో హనుమాన్ ఆలయ అవరణంలో శివపంచాయత, నవగ్రహ విగ్రహాలు, ధ్వజ స్తంభ ప్రతిష్టాపన మహోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున హజరై ప్రత్యేకంగా నిర్వహించిన హెూమ యజ్ఞం, కుంకుమార్చనలో పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోవాలని వినతి

నవతెలంగాణ- సిద్దిపేట అర్బన్



తమను అకారణంగా తొలగించారని, వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట స్టాఫ్ నర్సులు మంగళవారం హైదరాబాద్ ప్రజాభవన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ ప్రవేట్ ఏజెన్సీ ద్వారా అవుట్సోర్సింగ్ పద్ధతిలో రిక్రూట్ చేసుకొని పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఔట్సోర్సింగ్ స్టాఫ్ నర్స్‌లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఔట్సోర్సింగ్ సిబ్బంది సంపత్, రాజ్ కుమార్, ముకన్య, బాలస్వామి, తార, గీత, శ్వేత, బాల్ లక్ష్మీ, వనజా పాల్గొన్నారు.

ఏటీఎం మిషన్ ధ్వంసం

నవతెలంగాణ -దుబ్బాక



గుర్తు తెలియని దుండగులు ఏటీఎం మెషిన్‌ను ధ్వంసం చేసి నగదు చోరీ చేసేందుకు ప్రయత్నించిన ఘటన మండల పరిధిలోని హబ్సీపూర్ గ్రామంలో సోమవారం అర్ధరాత్రి జరిగింది.దుబ్బాక ఎస్ఐ వీ.గంగరాజు తెలిపిన వివరాలు ప్రకారం... హబ్సీపూర్ లోని అంబేద్కర్ విగ్రహ చౌరస్తా వద్ద ఉన్న "ఇండియా వన్ ఏటీఎం సెంటర్" లోకి సోమవారం అర్ధరాత్రి ఇద్దరు గుర్తుతెలియని దుండగులు ప్రవేశించి ఏటీఎం మిషన్ ను ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారు.మంగళవారం ఉదయం ఏటీఎం సెంటర్ ను గమనించిన స్థానికులు దుబాక పోలీసులకు సమాచారం అందించారు.ఈ ఘటనపై సిద్దిపేట ఇండియా వన్ ఏటీఎం నిర్వహకుడు వెంకటరెడ్డి దుబ్బాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు,దుండగులను త్వరలోనే పట్టుకుంటామని ఎస్ఐ గంగ రాజు తెలిపారు.

నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలి

నవతెలంగాణ- కొండపాక



రిజర్వాయర్ల నుంచి నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కొండపాక వైస్ ఎంపీపీ, ఎంపీటీసీల ఫోరం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవిరవీందర్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాలువల ద్వారా చెరువులకు నీటిని సరఫరా చేసి కొండపాక, నంగునూరు, కొమరవెల్లి, చేర్యాల మండలాల రైతులను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎండలు ముదరడంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయన్నారు. గత సంవత్సరం వర్షాలు సమృద్ధిగా పడక పోవడంతో బోర్ల నుంచి నీరు రాక చెరువుల్లో నీరు లేక పంట పొలాలు ఎండుతున్నాయని పేర్కొన్నాడు. ఆరుగాలం కష్టించి పనిచేసి పంట పొలాలు నమ్ముకున్న రైతన్నకు కన్నీళ్లే మిగులుతున్నాయన్నారు. పంట పొట్ట కొచ్చే సమయానికి నీరు అందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి కాలువల ద్వారా చెరువులను నింపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాత్ పల్లి మాజీ సర్పంచ్ బచ్చలి మహిపాల్ పాల్గొన్నారు.

లక్ష్యంతో ముందుకు సాగాలి

నవతెలంగాణ-తొగుట



జీవితంలో ఒక లక్ష్యమంటూ పెట్టుకుని ముందుకు సాగాలని, మనిషి మనుగడకు చదువు చాలా ముఖ్యమని ఎస్ఐ బి. లింగం సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హ్యాంటి హ్యూమన్ ట్రాకింగ్ ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, మానవ అక్రమ రవాణా నిర్మూలన, గుడ్ టచ్, బాడ్ టచ్ గురించి గజ్వేల్ షీ టీమ్ బందంతో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ లింగం మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మవద్దన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, అవసరం మేరకే సెల్ ఫోన్ వాడుకోవాలన్నారు. టెక్నాలజీలో మంచిని స్వీకరించాలని సూచించారు. తల్లి దండ్రుల కష్టాన్ని గుర్తుంచుకొని చదువును ఇష్టపడి చదవాలన్నారు. మనిషి మనుగడకు చదువు చాలా ముఖ్యమన్నారు. ఒకరికొకరు చదువులో సహాయం చేసుకుంటూ కష్టపడి చదువుకోవాలన్నారు. బాల్య వివాహాలు చేసుకొని భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. బాల్య వివాహాలు, మానవ అక్రమా రవాణా గురించి సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. సైబర్ నేరాలకు గురికావద్దని, తెలియని వ్యక్తులు నుండీ వచ్చే మెసేజ్‌లకు రెస్పాండ్ కావద్దన్నారు. మహిళలు, యువతులు ఎలాంటి సమస్య ఉన్న నిర్భయంగా షీ టీమ్ నెంబర్ 8712667434 కాల్ చేయాలని సూచించారు. మహిళల రక్షణకు ఎల్లప్పుడు షీ టీమ్ అండగా ఉంటుందని అన్నారు. అపరిచిత వ్యక్తులను నమ్మవద్దన్నారు. ప్రేమ పెళ్లి అంటూ చెప్పే వారి మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. యం. అనురాధ తెలుగు టీచర్ షీటీమ్స్, పోలీసులు నిర్వహిస్తున్న విధులపై కవిత రాసి అద్భుతంగా వినిపించారు. అందుకుగాను ఎస్ఐ లింగం, అనురాధ ఉపాధ్యాయురాలును అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యులు ఉపేందర్, అధ్యాపకులు, తొగుట ఎఎస్ఐ రాంరెడ్డి, గజ్వేల్ షీటీమ్ బందం శ్రీరాములు ఏఎస్ఐ, కానిస్టేబుళ్లు రామచంద్రారెడ్డి, మహేష్, మహిళా కానిస్టేబుళ్లు శ్యామల, లావణ్య పాల్గొన్నారు.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు



- **జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యజిత్**

నవతెలంగాణ- సిద్దిపేట కలెక్టరేట్

ఈ నెల 26 నుంచి మార్చి 1వ తేదీ వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యజిత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో వ్యాసరచన, నినాదం, పోస్టర్ అనే మూడు విభాగాల్లో పోటీలను పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యార్థులకు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. వ్యాసరచన విభాగంలో "నేను రాత్రికి రాత్రే మిల్లియనియర్గా మారితే, ఆ డబ్బును ఎలా ఉపయోగిస్తాను" అనే అంశం పై 300 పదాలతో ఇంగ్లీష్, తెలుగు, హిందీ భాషల్లో రాయవచ్చని తెలిపారు. "పొదుపు మరి చక్రవడ్డీ యొక్క శక్తి" అనే అంశంపై, పోస్టర్ విభాగంలో "డిజిటల్ సైబర్ పరిశుభ్రత" అనే అంశంపై చేతితో గానీ, డిజిటల్గా గానీ వేయవచ్చని అన్నారు.అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 10 నుంచి 25 ఏండ్ల మధ్య వయస్సు గల విద్యార్థులు అందరూ ఈ పోటీలో పాల్గొనవచ్చని తెలిపారు. విద్యార్థి పేరు, పాఠశాల, కళాశాల పేరు, ప్రభుత్వ, ప్రైవేట్, వయస్సు, ఫోన్ నంబర్ తప్పనిసరిగా దరఖాస్తులో పేర్కొనాలని సూచించారు. జిల్లా స్థాయిలో ఈ మూడు పోటీలలో విజేతలకు బహుమతి, సర్టిఫికేట్ ప్రధానంతో పాటు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత పొందుతారని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు లీడ్ బ్యాంక్ కార్యాలయం, జిల్లా కలెక్టరేట్ కార్యాలయం, దుద్దెడ గ్రామం చేరుకోవాలి తెలిపారు . 27న అన్ని పాఠశాలలు, కళాశాల విద్యార్థులతో వాకథాన్ ఉంటుందన్నారు.

టీహెచ్ఆర్ కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభించనున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ - సిద్దిపేట

రూ.50 లక్షలతో జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ వారి సహకారంతో సీఎస్ఆర్ నిధులతో పట్టణంలోని బాలికల పాఠశాలలో 21 కంప్యూటర్స్‌తో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే హరీశ్ రావు బుధవారం ప్రారంభించనున్నారు. హరీశ్ రావు కషితో ఈ ల్యాబ్ ఏర్పాటు చేశారు. పాఠ్యంశాలు ఆన్‌లైన్ మాధ్యమంగా నేర్చుకునేలా ఎనిమిది క్లాస్ రూమ్స్‌లో డిజిటల్ పాఠ్యంశాల బోధనకు 8 ప్యానల్ బోర్డ్స్ ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవ ఏర్పాట్లను పాఠశాల సిబ్బంది పూర్తి చేశారు.

ప్రజాభవన్‌లో దరఖాస్తు చేసుకున్న ఖమ్మంపల్లి గ్రామస్తులు

నవతెలంగాణ-కొండపాక



కబ్జాకు గురైన విలువైన ప్రభుత్వ భూమిని స్వాధీన పర్చుకొని గ్రామ అవసరాలకు, పేదలకు పంచాలని కోరుతూ కొండపాక మండలం ఖమ్మంపల్లి ఎంపీటీసీ యాదగిరి ఆధ్వర్యంలో గ్రామస్తులు మంగళవారం ప్రజాభవన్‌లో దరఖాస్తు చేశారు. మర్పడగ రెవెన్యూ పరిధిలోని ఖమ్మంపల్లి గ్రామంలో 1061 సర్వే నెంబర్లలో 130 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, అందులో కొంత కబ్జాకు గురవుతుందన్న విషయాన్ని స్థానిక అధికారుల దష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ సర్వే నంబర్ భూమిలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మించడానికి సర్వే కూడా చేశారన్నారు. కొంత భూమిలో గ్రామ అవసరాల కోసం డంపింగ్ యార్డ్ నిర్మించారన్నారు. ఇందులో కొందరు నాయకులు, అధికారుల అండదండతో కబ్జా చేశారని ఎంపీటీసీ యాదగిరి తెలిపారు. గతంలో పలుమార్లు పిర్యాదు చేసిన ఫలితం లేదన్నారు. ప్రభుత్వ భూమిని సర్వే చేసి కబ్జా నుంచి స్వాధీనం చేసుకొని గ్రామ అవసరాలకు అలాగే పేదలకు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-తొగుట

హోటల్ సరిగా నడవక అప్పులు పెరిగిపోయి కలత చెందిన వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మ హత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... కాన్గల్ గ్రామానికి చెందిన ముత్తొల్ల కనకరాజు (27) గ్రామంలో హోటల్ నడుపుకుంటూ పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. హోటల్ సరిగా నడవక పోవడంతో, అంతకుముందు చేసిన అప్పులు పెరిగిపోయాయి. అప్పులు తీర్చే మార్గం లేక మానసిక ఆవేదనకు గురై ఫిబ్రవరి 1వ తేదీన తన హెూటల్ వెనుక వైపు గల వేప చెట్టు కింద ఏదో గుర్తు తెలియని పురుగుల మందు తాగిఆత్మహత్య కు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే చికిత్స కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికితరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరు గైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. నాటి నుండి చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందాడు. మృతుని భార్య కల్పన ఫిర్యాదు మేర కు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్ కానిస్టేబుల్ అనిల్ కుమార్ తెలి పారు.

23న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ సెలక్షన్స్

నవతెలంగాణ - సిద్దిపేట

సిద్దిపేట జిల్లా అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక స్టేడియం మైదానంలో ఈనెల 23న ఉదయం 7:30 గంటలకు అండర్ 14,16,18,20, ఓపెన్ విభాగంలో బాల బాలికలకు వేరువేరుగా 400 మీటర్స్ పరుగు పోటీల ఎంపికలు ఉంటాయని జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షులు గ్యాదరి పరమేశ్వర్, ప్రధాన కార్యదర్శి కర్రోల్ల వెంకట స్వామి గౌడ్ తెలిపారు. మంగళవారం మాట్లాడుతూ ఆసక్తి గలవారు పుట్టిన ధ్రువపత్రం, ఎస్ఎస్‌సీ మెమో తీసుకొని రావాలని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 25 న హైదరాబాదులోని ఔటర్ రింగ్ రోడ్ కొల్లూరు లో గల గాడియం స్పోర్టోపియం స్కూల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 9704661898, 8501987079, 9704061543 సంప్రదించాలని సూచించారు.

వరిలో గంధక ప్రభావం నివారణ చర్యలు పాటించాలి

నవతెలంగాణ- రాయపోల్



వరి పైర్లు గంధక దుష్ప్రభావం వల్ల తీవ్రంగా దెబ్బతింటున్నాయని ఏఈఓ ప్రశాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం, వేసంగిలో ఒకే పొలంలో సంవత్సరాలుగా వరి సాగుచేయడం వల్ల వరిలో "సల్ఫైడ్" దుష్ప్రభావం కనిపిస్తుందన్నారు. "సల్ఫైడ్" దుష్ప్రభావం వలన 30-50 శాతం వరకు పంట దిగుబడి నష్టపోయే అవకాశముందన్నారు. అధిక నీటి ముంపు, తగిన రీతిలో పంట వేర్లకు గాలి అందకపోవటం, నేలలో రసాయన చర్యల వల్ల మార్పు చెందడం వల్ల వరిలో గంధక దుష్ప్రబావం చూపుతుందన్నారు. ఇనుము ధాతువు లోపం ఉండే పొలాల్లో అలాగే బరువు నేలల్లో సల్ఫైడ్ కలిగిన 20-20-0-13 లాంటి కాంప్లెక్సులను అధికంగా వాడటం, సింగిల్ సూపర్ ఫాస్పెట్, అమ్మోనియం "సల్ఫైడ్"ని ఎక్కువగా వాడటం వలన ఈ "సల్ఫైడ్" దుష్ప్రభావాన్ని పొలంలో గమనించవచ్చన్నారు. "సల్ఫైడ్" దుష్ప్రభావం వల్ల వరి నేలల్లో, పంట మధ్య కాలంలో అక్కడక్కడ గుంపులు గుంపులుగా బాగా పెరిగిన పంట మొత్తము పసువు వర్ణములోకి మారి ఎదుగుదల క్షీణిస్తుందన్నారు.

మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ- సిద్దిపేట అర్బన్

సిద్దిపేట అర్బన్ మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన సక్కుబాయి ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు భరించలేక ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. సోమవారం పురుగుల మందు తాగిన మహిళను స్థానికులు గమనించి సిద్దిపేట ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స చేస్తుండగానే మంగళవారం మధ్యాహ్నం ఆమె మతి చెందినట్లు బంధువులు తెలిపారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని మతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మెంబర్‌గా రాజు

నవ తెలంగాణ- సిద్దిపేట అర్బన్

సిద్దిపేట పట్టణానికి చెందిన రాజబోయిన రాజు హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మెంబర్‌గా ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం కౌన్సిల్ మెంబర్‌గా నియామక పత్రం అందుకున్నట్లు రాజు తెలిపారు. ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా పరిష్కరించేందుకు తన వంతు కషి చేస్తామన్నారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్లో మెంబర్‌గా అవకాశం కల్పించినందుకు కౌన్సిల్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

భీష్మ ఏకాదశి వేడుకలు

నవతెలంగాణ-కొండపాక

కుకునూరుపల్లిలోని గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. భీష్మ మహారాజు చిత్రపటంతో ఏర్పాటు చేసిన రథోత్సవ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, పీఎస్ఆర్ సేవా సంస్థ చైర్మన్ పోల్కంపల్లి నరేందర్ జెండా ఊపి ప్రారంభించారు. గ్రామంలోని అన్ని వీధుల గుండా రథాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యాదవ రెడ్డి మాట్లాడుతూ గంగపుత్రుల ఆర్థిక అభివద్ధి కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం కషి చేసిందనిన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సైతం వారి అభ్యున్నతికి పాటుపడాలని కోరారు. గ్రామంలో నిర్మించనున్న గంగమ్మ దేవాలయానికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షుడు దొంతి సత్తయ్య మల్లేశం, సంపత్, నాగరాజు, నర్సింలు, సత్తయ్య, దొంతి ఇస్తారు, భూపాల్, రాజు పాల్గొన్నారు.

22న పురుషుల సీనియర్ కబడ్డీ జట్టు ఎంపిక

నవతెలంగాణ -సిద్దిపేట

తెలంగాణ రాష్ట్ర అంతర్‌జిల్లాల రాష్ట్ర స్థాయి కబడ్డీ చాంపియన్షిప్ పోటీలకు పురుషుల సిద్దిపేట జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక ఈ నెల 22న గురువారం ఉదయం 10 గంటలకు సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మిని స్టేడియం గ్రౌండ్‌లో నిర్వహించడం జరుగుతుందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు నేతి చిన్న సంతోష్ కుమార్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కుంటనోళ్ళ శివ కుమార్ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఈ ఎంపికలలో ఎంపికైన క్రిడాకారులు నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లో నిర్వహించే 70వ రాష్ట్ర స్థాయి కబడ్డీ చాంపియన్షిప్ పోటీలలో పాల్గొంటారన్నారు. ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రిడాకారులు ఆధార్ కార్డు, పాస్ పోటో, 85 కిలోల లోపు ఉన్న క్రిడాకారులు అర్హులు అనీ తెలిపారు. పూర్తి వివరాలకు శ్రీకాంత్ 9550847409, మహేష్ 8885728286 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ప్రజాస్వామ్య విలువలను అపహాస్యం చేసిన ఎమ్మెల్యే

- **కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ చెరుకు శ్రీనివాసరెడ్డి**

నవతెలంగాణ - మిరుదొడ్డి



శాసనసభ సార్వత్రిక ఎన్నికల్లో ప్రజాస్వామ్య విలువలను అపహాస్యం చేసే విధంగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి వ్యవహరించారని కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ చెరుకు శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఓటర్లను ప్రలోభాలకు గురి చేశారన్నారు. రానున్న లోక సభ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కార్యకర్త లు సైనికుల కృషి చేయాలన్నారు. అనంతరం పలు గ్రామాలకు చెందిన యువకులు పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజేశం, మండల మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి, నాయకులు భూమా గౌడ్, రాజు ,భూపాల్ గౌడ్ , హర్షద్, వెంకటస్వామి గౌడ్, నరేందర్ రెడ్డి, జోగ్యారి భాస్కర్, కుట్టల్, మహేష్ ,జాంగిర్ ,సుదర్శన్, కనకా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో మొక్కలను సంరక్షించాలి

నవతెలంగాణ-మర్కుక్

వేసవికాలంలో నీటి ఎద్దడి ఏర్పడే పరిస్థితి ఉన్నందున నర్సరీలలో మొక్కలను జాగ్రత్తగా పెంచాలని మర్కుక్ ఎంపీడీవో అఫ్జరోద్దిన్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని నర్సరీలను అయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్యం పై తగు జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, టిఏ నరేష్, ఎఫ్ఏ కరుణాకర్ పాల్గొన్నారు.